జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 07 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 60 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: పూర్ణిమ - 22:55:30 వరకు నక్షత్రంస్వాతి - 28:35:51 వరకు కరణంవిష్టి - 10:03:09 వరకు, బవ - 22:55:30 వరకు పక్షంశుక్ల యోగంసిద్ధి - 21:12:02 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**సీఎం అభ్యర్థిపై బీజేపీలో సమాలోచనలు**

**ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు**

కోల్‌కతా,మే6(ప్రజాజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు

మిగతా1 2లో..

### తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

**బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్**

హైదరాబాద్,మే6(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ

మిగతా 2లో..

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం!

### కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ప్రాజెక్ట్

### ఫేజ్-3కింద ఎయిర్‌పోర్ట్ ఫ్యూచర్ సిటీ కారిడార్

### కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి



న్యూఢిల్లీ,మే6(ప్రజాజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు భేటీ అయిన ఇరువురు నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నట్టు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు–ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్–3 కింద చేపట్టాలని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన

మిగతా 2లో..

## సీఈసీ నియామకంలో సీజే తొలగింపు కేసు


### విచారణ వాయిదా కుదరదన్న సుప్రీం

న్యూఢిల్లీ,మే6(ప్రజాజ్యోతి): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వాన్ని తొలగించిన కేసుపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. కాగా

మిగతా 2లో..

## సీఎం పర్యటనలతో ట్రాఫిక్ చిక్కులు

- జనాలను ఇబ్బంది పెట్టొద్దన్న సిఎం
- డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆదేశాలు జారీ



హైదరాబాద్,మే6(ప్రజాజ్యోతి): తన కాన్వాయ్ కారణంగా సామాన్యులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు

మిగతా 2లో..

## రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న పంపిణీ

- బహిరంగ మార్కెట్‌లో వేలానికి ఇక స్వస్తి
- మొక్కజొన్న, జొన్న రైతులకు ప్రభుత్వం అండ




హైదరాబాద్,మే6(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం మరోసారి భరోసానిచ్చింది. మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, సేకరించిన ధాన్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు రేషన్ దుకాణాల ద్వారా నేరుగా పేద ప్రజల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పంటలను బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపుల లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. పంట పండించిన రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో మొక్కజొన్న, జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు

మిగతా 12లో..

## తమిళనాడు అసెంబ్లీ రద్దు

- ఉత్తర్వులు ఇచ్చిన గవర్నర్ విశ్వనాథ్
- నేటి విజయ్ ప్రమాణ స్వీకారం వాయిదా
- తమిళనాట మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఏకమవుతున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు



చెన్నై,మే6(ప్రజాజ్యోతి): తమిళనాడులో టీవికే ప్రభుత్వం ఏర్పాటుపై ఓవైపు సస్పెన్స్ కొనసాగుతుండగా, మరోవైపు తమిళనాడు 16వ శాసనసభ (2021–26)ను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకల్ బుధవారంనాడు రద్దు చేశారు. ఈనెల 5 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. బలనిరూపణకు అవసరమైన మద్దతు లేఖలు అందించని కారణంగా విజయ్ పార్టీని కూడా గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేదు. దీంతో నేటి విజయ్ ప్రమాణం రద్దయ్యింది. మరోవైపు డిఎంకె పార్టీలు అనూహ్యంగా రంగంలోకి దిగాయి. కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చర్చలు మొదలు పెట్టినట్లు సమాచారం. దీంతో వారి బలం 120కి ఉన్నట్లుగా సామాచరం.

మిగతా 2లో..

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

- 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి
- మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన
- పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం
- గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ

చెన్నై,మే6(ప్రజాజ్యోతి): టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం.

మిగతా 2లో..

## రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ నయవంచన

### పండించిన ప్రతి గింజను కొనేదాకా కాంగ్రెస్ ను వదిలిపెట్టం

### ప్రభుత్వాన్ని హెచ్చరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 06, (ప్రజాజ్యోతి): రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నయవంచనకు పాల్పడిందని, రైతులు పండించిన పంటలను కొంటారా లేదా 70 లక్షల తెలంగాణ రైతన్నల చేతిలో తన్నులు తింటారా అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రైతన్నల పంటలను కొనకుంటే గ్రామ గ్రామాన తెలంగాణ రైతన్నలు నాగళ్లను మడత పెట్టి మరీ సరిహద్దుల వరకు ఉరికిస్తారని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ రైతన్నల చైతన్యాన్ని తక్కువ అంచనా వేయొద్దని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో రైతన్నల పంటలు అన్ని చివరి గింజ దాకా కొనేదాకా కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టేదే లేదని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ ఇచ్చి సరిగ్గా నాలుగు సంవత్సరాలైనా ఒక్క హామీని నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వరంగల్ లో ఏర్పాటు చేసిన రైతు సంగ్రామ సదస్సు సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేస్తున్న తీరుపైన విరుచుకుపడ్డారు.రైతన్నలు ఆందోళన చెందవద్దని, ఆత్మహత్యల గురించి ఆలోచించవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కాలర్ పట్టుకొని

మిగతా 12లో..

## శివధర్ రెడ్డి నియామకంపై సవాల్

- ప్రభుత్వ సలహాదారుగా మాజీ డిజిపి నియామకం
- స్టే విధించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు
- భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతలు
- గవర్నర్‌తో శివధర్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ



హైదరాబాద్,మే6(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం సవాల్ చేస్తూ హైకోర్టులో టి. ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక డీజీపీ నియామకంపై గతంలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా కొత్త అప్లికేషన్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేశారు.

మిగతా 12లో..

## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

### బత్తిని కుటుంబ సభ్యుల ప్రకటన

హైదరాబాద్,మే6(ప్రజాజ్యోతి): ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అందించే చేప ప్రసాదం పంపిణీ జూన్ 8న ప్రారంభించనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఉబ్బసం, శ్వాసకోస వ్యాధులను

మిగతా 2లో..



## ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ విష ప్రచారం

- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- 95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్,మే6(ప్రజాజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేయడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు అంశంపై ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తూ, రైతులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తమ ప్రభుత్వం

మిగతా 12లో..



# సంపాదకీయం

## మమతా బెనర్జీ అహంకారం !

ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్దంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్‌ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరిగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత్త ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం!



మొదటిపేజీ తరువాయి..

మెట్రో ఫేజ్-2సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్ట్‌ను భారత ప్రభుత్వం ? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-ఎఎఎకిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

మొదటిపేజీ తరువాయి..

బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# తమిళనాడు అసెంబ్లీ రద్దు

మొదటిపేజీ తరువాయి..

ఇందులో కాంగ్రెస్, బిజెపిలను దూరం పెట్టాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈనెల 7న ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ సారథ్యంలోని టీవీకే ఆలోచనగా ఉంది. ఇందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ప్రమాణస్వీకారం మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను విజయ్ కలిశారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కోరారు. అయితే విజయ్ చూపిన సంఖ్యాబలంతో గవర్నర్ సంతృప్తి చెందలేదు. ప్రభుత్వం ఏర్పాటు టీవీకేకు తగినంత సంఖ్యాబలం లేదని భావించిన గవర్నర్ 118 మంది సభ్యులు సమకూరిన తర్వాత రావాలని సూచించినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల్లో టీవీకే 108 చోట్ల గెలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది సభ్యుల బలం సంపాదించలేకపోయింది. డీఎంకేతో పొత్తులో భాగంగా 5 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు మద్దతు ప్రకటించింది. విజయ్ గెలిచిన రెండు సీట్లలో ఒక సీటును మినహాయిస్తే టీవీకే సంఖ్యాబలం 112కు చేరుకుంది. దీంతో మరో ఆరుగురి మద్దతు టీవీకేకు అవసరమైంది. ప్రస్తుతం టీవీకేకు ఎవరు మద్దతు ఇవ్వనున్నారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. విజయ్‌కు మద్దతిచ్చే అవకాశాలను అన్నాడీఎంకే బుధవారంనాడు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఎడప్పాడి పళనిస్వామి నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై టీవీకేకు సపోర్ట్ ఇవ్వరాదని నిర్ణయించారు. డీఎంకే భాగస్వామ్య పార్టీ అయిన వీసీకే మద్దతును టీవీకే కోరినప్పటికీ ఆ పార్టీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వీసీకేకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. టీవీకే ఆహ్వానం అందినప్పటికీ డీఎంకే భాగస్వాములుగా ఉన్న వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లిగ్ పార్టీలు టీవీకేకు సపోర్ట్ నిరాకరించాయి. ఈ పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను కలుసున్నారు. అనంతరం డీఎంకేకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ఆరుగురు ఎమ్మెల్యేల బలాన్ని టీఎంసీ ఎలా కూడగట్టనుందనేది సస్పెన్స్‌గా మారింది.

## వైద్యారోగ్య శాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

**మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి**

**నారాయణఖేడ్ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక**

సంగారెడ్డి,మే6(ప్రజాజ్యోతి): ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీని చేపట్టామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు . త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలను వెల్లడిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా, వైద్య, మహిళా సాధికారత, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యకరణ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో స్థానిక శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా బాల సదనాలను, అంగన్వాడీలను కాపాడుకునే గురుతర బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వ, సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణీ, బాలింతలకు, 3 నుండి 6 ఏండ్ల పిల్లలకి ఒక పూట సంపూర్ణ భోజనం, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు టేక్ హోమ్ రేషన్ అందించడం, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లలకి పూర్వ ప్రాథమిక విద్య అందించడంతోపాటు పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ – స్కూలు, రోగ నిరోధకత, రిఫరల్ సేవలు, ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తల సేవలను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీరి సేవలను మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న బాలసదనం బాలికలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్ఓ ప్లాంట్ ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారోత్సవాలలో జిల్లాలో చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ శుభ్రత, 18 సంవత్సరాల పైబడిన సిసిఐ పిల్లలను గుర్తించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించుట, అత్యవసర సర్టిఫికెట్లు ఆరోగ్య కార్డుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, సంస్థల నుండి పిల్లలను బయటికి డిశ్చార్జ్ చేసి తిరిగి వారికి పునరావాస కల్పించుట మరియు ఫాలో అప్ పక్రియ, రెసిడెన్షియల్ స్కూల్స్ లో చేర్పు పక్రియ ఇలాంటి అంశాలను జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా.సంజీవరెడ్డి, పాల్గొన్నారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..

తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

## తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

మొదటిపేజీ తరువాయి..

నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. బ్రహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేశ్ నియమితులయ్యారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్: గట్టు తిమ్మప్ప, యాదవ కార్పొరేషన్ చైర్మన్: రఘునాథ్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్: గుంజా రేణుక హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్: దూడెం వెంకట రమణ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్: చరణ్ కౌశిక్,తెలుగు అకాడమీ చైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ, వాషర్ మెన్ – డాక్టర్ అజయ్ కుమార్ గీత కార్మిక – చంద్ర శేఖర్ గౌడ్,పెరిక – గొంగరి వెంకటేశర్లు,మేర – సంగ వెంకట్ రాజం,మున్నూరు కాపు – బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,పద్మశాలి – గూడూరి శ్రీనివాస్,వెలమ – జువ్వాడి నర్సింగ్ రావు ఉన్నారు.

## సీఈసీ నియామకంలో సీజే తొలగింపు కేసు

మొదటిపేజీ తరువాయి..

ఈ అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున ఈ కేసును కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని కేంద్రం తరఫు వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు. కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరిస్తూ..ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల



క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని.. ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేశారు. శబరిమల కేసును అసలు విచారించక పోవడమే మంచిదని మంగళవారం 9మంది న్యాయమూర్తుల ధర్మాసం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన లేవనెత్తారు. ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం వాటిపై విచారణ కొనసాగుతోంది.

# సీఎం పర్యటనలతో ట్రాఫిక్ చిక్కులు

మొదటిపేజీ తరువాయి..

కలగకుండా చూడాలని డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు డీజీపీ సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో



అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.

## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

వివారించేందుకు ఉచితంగా అందించే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని బత్తిని మృగశిర ట్రస్టు నిర్వాహకులు, దివంగత బత్తిని హరినాథ్ కొడుకు అమర్నాథ్ గౌడ్ తెలిపారు. జూన్ 8వ తేదీన తమ కుటుంబ సభ్యులు చేప ప్రసాదం సేవించిన తర్వాత సాయంత్రం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానానికి తరలించనున్నట్లు తెలిపారు. ముహూర్తం ప్రకారం అదేరోజు రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. చేప ప్రసాదం పంపిణీకి ఇప్పటికే ఫిషరీ డిపా÷–టం÷–మెంట్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, పోలీస్ డిపా÷–టం÷–మెంట్, జీహెఎంసీ, ప్రభుత్వం పర్మిషన్ తీసుకున్నామని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్, అనిరుధ్ గౌడ్, దుర్గా గౌడ్ మంగళవారం తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

### - చిట్యాల మార్కెట్ యార్డులో అంబలి, తాగునీటి కేంద్రం ప్రారంభం


వనపర్తి ప్రతినిధి, మే 6 (ప్రజాజ్యోతి):
వరి కొనుగోలు కేంద్రాలు మరియు మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు తాగునీరు, కనీస మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం చిట్యాల మార్కెట్



యార్డులో ఏర్పాటు చేసిన అంబలి, తాగునీటి కేంద్రాన్ని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన రైతులకు రాగి అంబలి, మంచినీరు అందించారు. జిల్లాలోని మిగిలిన అన్ని వరి కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లోనూ రైతులకు తాగునీరు, నీడ, ఇతర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## అపరిశుభ్ర నీటితో జిలేబి తయారీ... ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

వనపర్తి, మే 6 (ప్రజాజ్యోతి):
జిల్లా కేంద్రంలో ఆహార భద్రత నిబంధనలను తుంగలో తొక్కుతూ అపరిశుభ్ర పరిస్థితుల్లో స్వీట్లు తయారు చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. వనపర్తి పట్టణంలోని శ్రీనివాస బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న హరియాన జిలేబి సెంటర్‌లో పాకర పట్టిన, నీలి రంగులో కనిపిస్తున్న కలుషిత నీటిని ఉపయోగించి జిలేబీలు తయారు






చేస్తున్నారు. అపరిశుభ్ర నీటితో తయారవుతున్న ఈ ఆహార పదార్థాలు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ఘటనపై ఆహార భద్రత అధికారులు తక్షణమే స్పందించి తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జర్నలిస్టులపై కేసులు ఉపసంహరించాలి

### - ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాలి - ఎస్పీకి జర్నలిస్ట్ ల వినతి

మహబూబ్‌నగర్, మే 6 (ప్రజా జ్యోతి బ్యూరో):
జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలంటూ మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాలమూరు ప్రాంతానికి చెందిన జర్నలిస్టులు పెద్ద



సంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల ముగ్గురు జర్నలిస్టులపై నమోదైన కేసుల విషయాన్ని ఎస్పీకి వివరించిన వారు, నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తించే మీడియాపై ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం ద్వారా వారి వృత్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలికి తీసి సమాజానికి దిశానిర్దేశం చేసే జర్నలిస్టులపై అకారణంగా కేసులు పెట్టడం తగదని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రతి వ్యవస్థ బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర చారి, జనరల్ సెక్రటరీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. దాదాపు 100 మంది జర్నలిస్టులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 06(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నెలవారీ సాధారణ తనిఖీలో భాగంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఈవీఎంలు,బ్యాలెట్





యంత్రాల భద్రతపై అన్ని జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులకు,సిబ్బందికి సూచించారు.సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు మంజుల,సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు అవగాహనతోనే లాభసాటి వ్యవసాయం!

### - భూసారం కాపాడితేనే భావితరాలకు భరోసా!
### - కిసాన్ క్రెడిట్ కార్డు – రైతుకు ఆర్థిక బలం: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, మే 6 (ప్రజాజ్యోతి):
రైతు నిజంగా "రాజు" కావాలంటే భూసారం, పంట మార్పిడి, ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా మార్పిడి పద్ధతులు పాటిస్తేనే మంచి దిగుబడులు, లాభాలు సాధ్యమవుతాయని చెప్పారు.
బుధవారం గోపాల్పేట మండల రైతు వేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4 నుంచి 9 వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా పంట సాగు విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భూ ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డు) ద్వారా భూమిలోని పోషకాల స్థితిని తెలుసుకుని తగిన పంటలు, ఎరువులు వినియోగించాలని సూచించారు. అధికంగా యూరియా వాడితే పంట నాణ్యత, దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు కిసాన్ క్రెడిట్ కార్డు పొందాలని, తక్కువ వడ్డీతో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీలు లభిస్తాయని వివరించారు. పంట మార్పిడి ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవాలని, వరితో పాటు వేరుసెనగ, పామాయిల్, కూరగాయలు వంటి వాణిజ్య పంటలను సాగు చేయాలని సూచించారు. జిల్లాలో గన్ని బ్యాగుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సరఫరా సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటికే రేవల్లి మండలానికి 10 వేల గన్ని బ్యాగులు పంపించామని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





# బంగారు దుకాణాలకు కట్టుదిట్టమైన భద్రత అవసరం

### - సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ఎస్పీ హెచ్చరికలు

మహబూబ్‌నగర్, మే 6 (ప్రజా జ్యోతి బ్యూరో):
మహబూబ్‌నగర్ పట్టణంలోని విరాట్ విశ్వకర్మ సహకార సంఘం కార్యాలయంలో బులియన్ మార్కెట్, స్వర్ణకారులు సంఘం సభ్యులతో కలిసి బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులకు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఈ కార్యక్రమంలో పాల్గొని భద్రతా చర్యలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు దుకాణాల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు తప్పనిసరి అని తెలిపారు. ప్రతి షాప్‌లో నాణ్యమైన సీసీ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. కెమెరాల ఫుటేజ్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రపరచడం, షాప్ ఎంట్రీ–ఎగ్జిట్ పాయింట్లు స్పష్టంగా కవరయ్యేలా ఏర్పాటు చేయడం కీలకమని చెప్పారు. అలారం సిస్టమ్స్, సురక్షిత లాకర్లు, మొబైల్ అలర్ట్ సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా పద్ధతులను అమలు చేయాలని సూచించారు.
అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బంగారు దుకాణాలు ఉన్న ప్రాంతాల్లో గస్తీని మరింత బలోపేతం చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొబైల్ పార్టీలు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ మోసాలు, ఫేక్ కాల్స్, మెసేజెస్ ద్వారా డబ్బులు మోసగించే ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలియని లింకులు క్లిక్ చేయకుండా, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకుండా, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. స్వీయ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.
"ప్రజా భద్రతే మా ధ్యేయం" అనే నినాదంతో ప్రజలు పోలీసులతో సమన్వయం కలిగి పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్, బులియన్ మార్కెట్ అధ్యక్షుడు, స్వర్ణకారులు సంఘం అధ్యక్షుడు, బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులు పాల్గొన్నారు.






# వాణిజ్య పంటల వైపు రైతులు మళ్లాలి

### - పామాయిల్, పప్పు దినుసులతో అధిక లాభాలు సాధ్యం: డా. జి. చిన్నా రెడ్డి
### - సాయిల్ హెల్త్ కార్డులకు దరఖాస్తు చేయండి : కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మే 6 (ప్రజాజ్యోతి):
దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నా రెడ్డి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం స్థానిక దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో జిల్లా ఉద్యానవనాలు, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పంటల మార్పిడి అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆయిల్ గింజలు, పప్పు దినుసుల ఉత్పత్తి తక్కువగా ఉండటంతో విదేశాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీనివల్ల విదేశీ మారక నిల్వలు ఖర్చవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు పామాయిల్, పప్పు దినుసులు, కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పామాయిల్ పంట అధికంగా ఆయిల్ ఇస్తూ, దీర్ఘకాలికంగా లాభదాయకమని చెప్పారు. ప్రభుత్వం పామాయిల్ సాగుకు మొక్కల సబ్సిడీ, ఎరువులు, డ్రిప్ సదుపాయం, గుంతల తవ్వకం, అంతర్ పంటల సాగుకు నాలుగేళ్లపాటు ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రైతులు భూమి సారాన్ని కాపాడుకునేలా పంటల మార్పిడి చేయాలని సూచించారు. ప్రతి రైతు సాయిల్ హెల్త్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని, రైతు ఉత్పత్తిదారుల సంస్థల్లో సభ్యత్వం తీసుకోవాలని చెప్పారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డు పొందడం, సహకార సంఘాల్లో చేరడం ద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. పామాయిల్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు ప్రత్యేకంగా అవగాహన పర్యటనలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, నోడల్ అధికారి ప్రసాద్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయ్ భాస్కర్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.





## గండీడ్ పిఎసిఎస్ చైర్మన్‌గా గిరిమోని లక్ష్మీనారాయణ చార్జ్ స్వీకారం



గండీడ్, మే 6(ప్రజా జ్యోతి) :
గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) చైర్మన్‌గా గిరిమోని లక్ష్మీనారాయణ బుధవారం డీసీఓ ఆదేశాల మేరకు అధికారికంగా చార్జ్ స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు సంబంధించి జారీ చేసిన డీసీఓ Rc No.400/2025-C1 ప్రకారం ఈ బాధ్యతలు అప్పగించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ గిరిమోని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, తాను గతంలో కూడా దాదాపు రెండు సంవత్సరాల పాటు సహకార సంఘం చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకార సంఘం ద్వారా అన్ని సేవలను అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహకారం అందిస్తూ, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో ఆశన్నతో పాటు సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డేపల్లి మండలంలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు సన్మానం

వడ్డేపల్లి మే 06(ప్రజా జ్యోతి):
బుధవారం తనగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థినులు పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు.వడ్డేపల్లి మండల తెలుగు మీడియంలో 538 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన వెంకటాపురం రాజు కుమార్తె విజయలక్ష్మి,519 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన పిట్టల జనార్దన్ కుమార్తె చాముండేశ్వరి,516 మార్కులు సాధించి తృతీయ స్థానంలో



నిలిచిన బోయ శ్రీను కుమార్తె శ్రీలక్ష్మిని బీఆర్ఎస్వి పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు గడ్డం భరత్ బాబు మరియు గ్రామ యువ నాయకులు సన్మానించారు.ఈ సందర్భంగా గడ్డం భరత్ బాబు మాట్లాడుతూ,పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని,ఇలాగే పై చదువుల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తూ తమ లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు సుధాకర్,గౌడ్,హరికృష్ణ,పరమేష్,ఆంజనేయులు,మహేష్,తిమ్మప్ప నాయుడు,చైతన్య,కిష్టాపురం గ్రామ ఉపసర్పంచ్ రవి,బాలు,గ్రామస్థులు దొడ్ల రాముడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

### - డిసిసి చీఫ్ శివసేన రెడ్డి ఆదేశం - కలెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారం

వనపర్తి, మే 6 (ప్రజాజ్యోతి):
కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలోని ఐకెపి సెంటర్‌ను రైతుల ఆహ్వానం మేరకు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణను పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఐకెపి, మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. దళారులు తరువు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని రైతులు తెలియజేయడంతో వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని,



చిన్నచిన్న లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వానికి



చెడ్డ పేరు రాకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, తేమ శాతం కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని, వర్షం వస్తే ధాన్యం తడవకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుష్పలత శివకుమార్, ఉపసర్పంచ్ పోలికమ్మ, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విజయ్‌ను చూసి కేటీఆర్ నేర్చుకోవాలి

మహబూబ్‌నగర్, మే 6 (ప్రజా జ్యోతి బ్యూరో):
సీఎల్పీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. కేసీఆర్ కేటీఆర్‌కు అనుచిత భాష వాడటం నేర్పించారని విమర్శించారు. ఇటీవల గెలిచిన విజయ్‌ను చూసి కేటీఆర్ నేర్చుకోవాలని సూచించారు. రైతు సంగ్రామ సభ పేరుతో నిర్వహించిన సమావేశంలో రైతుల



సమస్యలపై మాట్లాడకుండా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడానికే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలు ఎక్కువకాలం అరాచకాలకు పాల్పడితే కాలగర్భంలో కలిసిపోయాయని, సిద్ధాంతాలతో నడిచే పార్టీలకే ప్రజలు మద్దతు ఇస్తారని అన్నారు. వారసత్వ రాజకీయాలు ఎప్పటికీ నిలవవని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు చెప్పే మాటలను తెలంగాణ ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పిన ఆయన, 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ ద్వారా 25 లక్షల 35 వేల మంది రైతులకు లాభం చేకూర్చామని తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా రైతన్నలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. ప్రస్తుతం నెలకు 5,200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, గత ప్రభుత్వంలో అది కేవలం 2,500 కోట్లకే పరిమితమైందని విమర్శించారు. రైతు కూలీలకు 3,000 కోట్లకు పైగా బోనస్ అందించామని తెలిపారు. గతంలో లక్ష రూపాయల రుణమాఫీని విడతల వారీగా విడుదల చేసి రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఎన్ని సార్లు అబద్ధాలు చెప్పినా అవి నిజం కావని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇలాగే విమర్శలు కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో ఎమ్మెల్యేగా గెలవలేరని హెచ్చరించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టామని, స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. ఫ్రీ బస్సు పథకం వల్ల మారుమూల గ్రామాల మహిళలు ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులు భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అన్వేష, ఆదిలాబాద్‌కు చెందిన ప్రగతి మంచి మార్కులు సాధించడానికి ఈ పథకం ఉపయోగపడిందని పేర్కొన్నారు. కేటీఆర్ తనకంటే జూనియర్ అయిన విజయ్‌ను చూసి నేర్చుకోవాలని మరోసారి సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

## సమయస్ఫూర్తితో పంటను కాపాడిన యువకుడు

**– పోలీసుల ప్రశంసలు**



**నెక్కొండ మే 6 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలోని అమీన్‌పేట సమీపంలో బుధవారం మధ్యాహ్నం పెను అగ్నిప్రమాదం తప్పింది. రైతులు తమ కష్టార్జితమైన మొక్క జొన్నలను నిల్వ చేసిన కుప్పల పక్కనే ఉన్న పొలంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అన్నదాతలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. గాలి తీవ్రతకు మంటలు వేగంగా వ్యాపిస్తూ మొక్కజొన్న రాశులకు చేరువవుతున్న తరుణంలో, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని స్థానికులతో కలిసి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో చింతనెక్కొండకు చెందిన ప్రవీణ్ తన ట్రాక్టర్ డోజర్‌తో ప్రాణాలకు తెగించి రంగంలోకి దిగారు. చుట్టుముడుతున్న అగ్నికీలల మధ్య డోజర్‌తో మట్టిని కప్పి మంటల తీవ్రతను అడ్డుకోవడమే కాకుండా, అవి ఇతర కుప్పలకు వ్యాపించకుండా సకాలంలో అడ్డుకట్ట వేశారు. ప్రవీణ్ చూపిన ధైర్యసాహసాల వల్ల లక్షలాది రూపాయల విలువైన రైతుల పంట బుగ్గి కాకుండా సురక్షితంగా బయటపడింది. ప్రవీణ్ సమయస్ఫూర్తిని, సాహసాన్ని అభినందిస్తూ స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ మరియు రైతులు అతడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. తన ప్రాణాలను పణంగా పెట్టి రైతుల కష్టాన్ని కాపాడిన ప్రవీణ్‌పై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## నూతన వధువరులను ఆశీర్వదించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి, మే 6 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ బాధ సారయ్య కూతురు వివాహం వి ఆర్ గార్డెన్స్‌లో జరుగగా ఈ వివాహ వేడుకలో రాష్ట్ర మాజీ మంత్రి దయాకర్ రావు ఆదేశాల మేరకు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందించిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపతి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లస్వామి, బోయిని కొమురయ్య, బోయిని సొమెయ్య బోయిని ముని బోయిని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాయి వంతెన నిర్మాణ పనులలో వేగం పెంచాలి

**– రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**





**ఏటూరు నాగారం మే 06 ప్రజాజ్యోతి :** ఏటూరు నాగారం మండలంలోనీ కొండాయి వంతెన నిర్మాణ పనులలో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏటూరు నాగారం మండలం 16.50 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న కొండాయి వంతెన నిర్మాణ పనుల పురోగతిని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొండాయి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వం 16.50 కోట్ల రూపాయల నిధులతో వంతెన నిర్మిస్తుందని తెలిపారు. యుద్ధ ప్రతిపాదికన వంతెన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. జూన్ – జూలై నాటికి ప్రజలకు వంతెన అందుబాటులో ఉండే విధంగా చూడాలని, వరద ప్రవాహం గ్రామం లోకి పోటెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండాయి గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కేటిఆర్ రైతు సంగ్రామ సదస్సుకు భారీగా తరలివెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు




**రాయపర్తి మే 6 ప్రజా జ్యోతి :** రాయపర్తి మండలంలోని వివిధ గ్రామాల నుండి బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డు లోని సిఎస్ఆర్ గార్డెన్ సమీపంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సంగ్రామ సదస్సుకు రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు రైతులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు వివిధ వాహనాల ద్వారా భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

# ఆకాశం వైపు చూస్తూ ఆందోళనలో అన్నదాత

- మక్క రైతుల ఆవేదన.. గోనె సంచుల కోసం లంచాల వేదన!
- మండల కేంద్రంలో నిలిచిపోయిన 10 వేల బస్తాలు
- ముడుపులిస్తేనే సంచుల పంపిణీ.. రైతుల ఆరోపణ



**చెన్నారావుపేట మే 6 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యం, అధికారుల నిర్లక్ష్యం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఒకవైపు ఆకాశం మేఘావృతమై వర్షం ముప్పు పొంచి ఉండటం, మరోవైపు అమ్ముకున్న ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని కొనుగోలు కేంద్రంలో సుమారు 10 వేల మొక్కజొన్న బస్తాలను రైతులు నింపి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ, వీటిని కళ్లాల నుండి గోదాములకు తరలించడంలో యంత్రాంగం విఫలమైంది. రోజులు గడుస్తున్నా లోడింగ్ కాకపోవడంతో ధాన్యం కళ్లాల్లోనే ఎండకు ఎండుతూ, గాలికి కొట్టుకుపోతోంది.?ఇదిలా ఉండగా, కొనుగోలు కేంద్రం వద్ద గోనె సంచుల పంపిణీలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. గోదాముల్లో సుమారు 10 వేల ఖాళీ సంచులు నిల్వ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి సిబ్బంది వాటిని రైతులకు ఇవ్వడం లేదని తెలుస్తోంది. పంట విస్తీర్ణం మరియు ధాన్యం నిల్వను బట్టి రూ. 2,000 నుండి రూ. 5,000 వరకు లంచం ఇస్తేనే సంచులు ఇస్తున్నారని కొందరు రైతులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇస్తేనే సంచులు ఇస్తున్నారు, లేదంటే సంచులు లేవని సాకులు చెబుతున్నారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు సంభవించి, అకాల వర్షం కురిస్తే కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి, ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడంపై రైతులు మండిపడుతున్నారు. ధాన్యం తడిస్తే తాము భారీగా నష్టపోతామని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, కళ్లాల్లో ఉన్న 10 వేల బస్తాలను తక్షణమే గోదాములకు తరలించాలని, అలాగే సంచుల పంపిణీలో లంచాలు అడుగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో
# టోకెన్ పద్ధతిని ఖచ్చితంగా పాటించాలి

**– అకాల వర్షాల నేపథ్యంలో కేంద్ర నిర్వాహకులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి**
**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, మే 06 (ప్రజాజ్యోతి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా టోకెన్ పద్ధతిని పక్కాగా అమలు చేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం నర్మెట్ట మండలం బొమ్మకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు ఇచ్చారు. టోకెన్ పద్ధతిని అమలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు రావని, కాంట కరెక్ట్‌గా చేసి వెంట వెంటనే కొనుగోలు అయిన ధాన్యాన్ని మిల్లు లకు తరలించాలన్నారు. లారీలు సమయానికి రాకపోతే తక్షణమే సమాచారం అందించాలన్నారు. కొనుగోలు అయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించని వెహికిల్ యాజమాన్యం పైన తప్పకుండ చర్యలు ఉంటాయన్నారు. కేంద్ర నిర్వాహకులు కొనుగోలుకి సంబందించిన అన్నీ రిజిస్టర్ లను పక్కాగా నిర్వహించాలని సరిపడా గన్ని బ్యాగ్‌లను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఓపిఎంఎస్ లో కూడా త్వరగా కొనుగోలు అయిన ధాన్యం వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ పైన వారి అభిప్రాయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ లను కప్పి పెట్టుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు.

# ధాన్యం కొనుగోలు పైన అత్యవసర సమావేశం
## నిర్వహించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**– తడిసిన ధాన్యం ఈరోజే మిల్లులకి పోవాలి అదనపు ట్రక్ లను పెట్టండి**
**– నర్మెట్ట, తరిగొప్పుల మండలాల రైతుల కోసం మొక్కజొన్న కేంద్రం ఏర్పాటు చేయండి**





**జనగామ జిల్లా ప్రతినిధి, మే 06 (ప్రజాజ్యోతి) :** అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యం త్వరగా కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన కు గురి కావద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. అదనపు కలెక్టర్ బెన్ షాలోం తో కలిసి సివిల్ సప్లై, వ్యవసాయ, కో ఆపరేటివ్, రవాణా, మార్కెటింగ్, డిఆర్డిఎ, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులతో బుధవారం మినీ కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ధాన్యం కొనుగోలు పైన అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యన్ని వెంటనే కొనుగోలు చేసి రవాణలో ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లింగ్‌కి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రతీ కేంద్రానికి ఒక ట్రక్‌ని కేటాయించడం జరిగిందని, ఇంకా అదనంగా కూడా అవసరమైన కేంద్రాలకు ట్రక్ లను పంపించి ట్యాగ్ చేసిన మిల్లులకు కొనుగోలు అయిన ధాన్యన్ని తరలించాలన్నారు. దాన్యం దిగుమతిలో మిల్లర్ లు ఇబ్బందులకు గురి చేయకుండా అధికారులు కూడా ప్రతీ మిల్‌ని పర్యవేక్షణ చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రతీ కేంద్రంలో అదనపు టార్పాలిన్ లని సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఏఈఓ లు ప్రతీ కేంద్రాన్ని విజిట్ చేస్తు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫిగా సాగేలా ప్రతీ రోజూ కేంద్రం లో అందుబాటులో ఉండాలన్నారు. నర్మెట్ట, తరిగొప్పుల మండలాల రైతులకు ఉపయోగ పడేలా అనువైన ప్రదేశం లో రేపు ఒక మొక్కజొన్న కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆ వెంటనే ప్రారంభించాలన్నారు. కొనుగోలు చేసిన మక్కలను నిర్దేశించిన గోదాం లలో భద్రపరచాలన్నారు. ఈ సమావేశం లో డిసిఓ, ఇంచార్జ్ డిఆర్డిఏ, సివిల్ సప్లై డిఎం, మార్కెటింగ్, ఇంచార్జ్ మార్క్ ఫెడ్ అధికారి, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందవద్దు

**– తడిసిన ప్రతి ధాన్యశీ గింజను కొనుగోలు చేస్తాం – జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 06 (ప్రజాజ్యోతి) :** రైతులు ఆందోళన చెందవద్దని ఆకాలవర్షానికి తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మహదేవ పూర్, సూరారం గ్రామాలలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించి, రైతులతో ముకాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్ మిల్ తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు మరియు రవాణా,



దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని డీఎంకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బంది లేకుండా చూడాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎంపిడిఓ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంఠ మహేశ్వరుని ఉత్సవాలకు హాజరైన మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్



**నర్సంపేట మే 6 (ప్రజాజ్యోతి) :** మాదన్నపేట, నాగుర్లపల్లిలో శ్రీ కంఠ మహేశ్వరుని ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈఉత్సవాలకు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ శ్రీ కంఠ మహేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించడం జరిగింది. ఉదయం 6 గంటలకు ఆలయంలో మామిడి తోరణాలతో అలంకరణ, 9 గంటలకు గౌడ సభ్యులకు మాలదారణ కార్యక్రమం జరిగింది. అనంతరం పురుషులు తెల్లని లుంగీ, బణియన్, కండువా ధరించి కొత్త బిందెలో పరిశుద్ధమైన నీరు జల బిందెలు ఎత్తుకొనగా, మహిళలు మంగళ హారతులతో శ్రీ కంఠ మహేశ్వరుని ఆలయానికి ఊరేగింపుగా డప్పు, చప్పుళ్లతో వచ్చి కంఠ మహేశ్వరుడు, సూరమాంబదే వి, రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ విగ్రహాలకు జాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం బొట్టు పెద్ద మనిషి గాదెగోని సుదర్శన్ గౌడ్, సారకోల పెద్ద మనిషి మేడిపల్లి ప్రసాద్ గౌడ్, అధ్యక్షులు దేషిని ఆనంద్ గౌడ్, ఉపాధ్యక్షులు మచ్చిక కుమారస్వామి గౌడ్, కార్యదర్శి నాతి చిన్న కట్టయ్య గౌడ్, సభ్యులు కట్ల పెద్ద రాజు గౌడ్, వేముల చంద్రమౌళి గౌడ్, మచ్చిక సాంబయ్య గౌడ్, నాతి రమేష్ గౌడ్, గాదెగోని చిన్న లింగయ్య గౌడ్, గాదెగోని కోటేశ్వర్ గౌడ్, గంధం శ్రీనివాస్ గౌడ్, మచ్చిక నర్సయ్య గౌడ్, మచ్చిక సతీష్ గౌడ్, కట్ల రాజు గౌడ్, నాతి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంటి కల సాకారం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం

**– ఎమ్మెల్యే నాగరాజు**



**హసన్‌పర్తి, మే 6(ప్రజాజ్యోతి) :** పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు తెలిపారు. పేదల సొంత ఇంటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. మండలంలోని జయగిరి గ్రామంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు నూతన గృహాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన జనగాని రమ--చంద్ర దంపతులు ప్రభుత్వ ఆర్థిక సహాయంతో తమ సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు లబ్ధిదారులకు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత గృహం కల్పించడం ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. జయగిరి గ్రామంలో గృహ నిర్మాణం పూర్తవడం పథకం విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన వారిని గుర్తించి పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహేశ్వరీ కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్

**మహేశ్వరి కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన కేటీఆర్**



**రాయపర్తి మే 6 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఏ కే తండా లో ఇటీవల కామాంధుల చేతుల్లో హత్య చేయబడిన గుగులోత్ మహేశ్వరీ కుటుంబ సభ్యులు బుధవారం హన్మకొండలో

రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి న్యాయం చేయాలనీ వినతి పత్రం ఇవ్వగా, తక్షణమే స్పందించి పోలీస్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తా అని హామీ ఇచ్చినబీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ . ఆయనను కలిసిన వారిలో ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డిరాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్‌లో ₹17 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నకిరేకల్, ప్రజా జ్యోతి:
నకిరేకల్ మున్సిపాలిటీలో నిన్న, నేడు కలిపి సుమారు ₹17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధి పనులతో పాటు కాలంవారి కుంట ఆధునీక






రణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేశారని, ఆ నిధులతో నకిరేకల్ పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని అన్నారు. మున్సిపాలిటీలోని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## జనగణన పారదర్శకంగా చేయాలి

### కమిషనర్ శ్రీనివాస్

### ఎన్యుమరేటర్లకు సెన్సెస్ కిట్లు పంపిణీ

మిర్యాలగూడ,మే 06,( ప్రజాజ్యోతి ):
పారదర్శకంగా క్షేత్రస్థాయిలో జనగణన చేపట్టాలని మిర్యాలగూడ



మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు సెన్సెస్ కిట్లను పంపిణీ చేశారు. జనాభా లెక్కల కోసం వచ్చే ఎన్యూరేటర్లకు ప్రజలు సహకరించి వివరాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిఓ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ శంకర్, చరణ్, ఫీల్డ్ ట్రైనర్స్ ఏ సైదిరెడ్డి, మచ్చ రఘు, సూపర్వైజర్లు ఎం రామిరెడ్డి, ఎండి ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

## నకిరేకల్ మున్సిపల్ పాలకవర్గ ముగింపు సభలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ప్రజా జ్యోతి:
నకిరేకల్ మున్సిపాలిటీ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గ ముగింపు సభలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే





వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటికే సుమారు ₹15 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, పార్టీ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేముల వీరేశం ఫైర్

నకిరేకల్, ప్రజా జ్యోతి:
నల్గొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మీడియా సమావేశం నిర్వహించారు. వరంగల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన రైతు సభలో చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ, రాష్ట్రానికి నాయకత్వం వహించే వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర ఉన్న వరంగల్‌లో జరిగిన సంఘటనలు, ఉద్యమకారులపై జరిగిన అన్యాయాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని పేర్కొన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ప్రజలు గుర్తుంచుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం రైతుల కోసం రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలు తీసుకుంటుంటే, ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడటం సరికాదన్నారు. "మేము కూడా అదే భాషలో



మాట్లాడగలం, కానీ మాకు సంస్కారం ఉంది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి, అమరవీరుల గౌరవం, ఉద్యోగాల అంశాల్లో గత ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే హక్కు తమకు ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన ముఖ్యమంత్రిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విమర్శలు పరిమితిలో ఉండాలని సూచించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, తమ తప్పులను సమీక్షించుకోవాలని ప్రతిపక్ష నాయకులకు హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల ఫలితమని, ఆ త్యాగాలను గౌరవించకుండా నైతికతల గురించి మాట్లాడటం సమంజసం కాదన్నారు. ప్రతిపక్షం అంటే కేవలం విమర్శలు చేయడం మాత్రమే కాకుండా, అసెంబ్లీలో ప్రజా సమస్యలను లేవనెత్తడం కూడా బాధ్యతేనని పేర్కొన్నారు. రాజకీయ భేదాలు ఉన్నా వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే వీరేశం సూచించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు సరైన తీర్పు ఇస్తారని అన్నారు.

# రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

### ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు

నల్గొండ మే 06(ప్రజాజ్యోతి ప్రతినిధి):
ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4 నుండి నిర్వహిస్తున్న రైతు వారోత్సవం లో




భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో మూడవ రోజైన బుధవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ రైతు వేదికలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలు పండించాలని, ప్రత్యేకించి ఆయా భూములకు అనుకూలంగా ఉండే పంటలు పండిస్తే అధిక దిగుబడులతో పాటు, అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించిందని, ఆయా గ్రామాలలోని భూములకు అనుగుణంగా పంటలు వేసేందుకు జిల్లా యంత్రాంగం తరుపున అవసరమైతే ఒక డ్రైవ్ లా భూముల సారవంతం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. పండిన పంటకు పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని, మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని అన్నారు. రైతులు ఒకే పంటను పండించకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, కొత్తగా వస్తున్న మార్పులపై దృష్టి సారించి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా పంటలు పండించాలని చెప్పారు. ముఖ్యంగా పంటల సాగుతో పాటు, పండించిన పంటల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ వంటి సౌకర్యాలు వినియోగించుకొని పంటలు నిల్వ చేసుకోవడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వరిలో ఎల్లప్పుడూ దొడ్డు బియ్యం కాకుండా, డిమాండ్ ఉన్న సన్న బియ్యం ఇతర రకాల ధాన్యాన్ని పండించాలని రైతులకు సూచించారు. రైతు సంక్షేమంలో భాగంగా తిప్పర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న భూమిని రైస్ మిల్ ఏర్పాటు చేసేందుకు సుముఖ వ్యక్తం చేసిన నేపథ్యంలో నాబార్డ్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలకు ఎలాంటి పాస్ పుస్తకాలు లేకుండా ఆన్లైన్లో భూభారతి వివరాల ఆధారంగా లోన్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సి ఈ ఓ ను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ధాన్యం సేకరణను త్వరలోనే పూర్తి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. రైస్ మిల్లర్లు, లారీలు,



వర్షం, తదితర కారణాలవల్ల కొనుగోలులో కొద్దిపాటి జాప్యం ఏర్పడిందని, మిల్లర్లు, హమాలీలు తదితర సమస్యలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, ఆర్ అండ్ బి శాఖ మాత్యులతో మాట్లాడి చర్చించి సమస్యలన్నీ అధిగమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతంధాన్యం తరలించేందుకు 900 లారీలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేవలం 20 రోజులలో 3 లక్షల ఇరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ప్రతిరోజు ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్, సమీక్షలు నిర్వహిస్తున్నామని, ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం మిల్లులలో అన్లోడింగ్ సమస్య లేదని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సహకార శాఖ సొసైటీల ద్వారా అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, ధాన్యం కొనుగోలు పై రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రితో పాటు ,జిల్లా కలెక్టర్ ప్రతిరోజు సమీక్షిస్తున్నారని, వారం, పది రోజుల్లో ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, రైతులు ఎల్లప్పుడూ వరినే సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖ ద్వారా అందించే పథకాల పై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు నాగరత్నరాజు, సహదేవ రెడ్డి, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, ఎల్డిఎం శ్రామిక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు. జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

## యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి

ఆలేరు మే 6 ప్రజా జ్యోతి :
యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని



మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముందుగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు.



ఈ కార్యక్రమానికి మహేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాకమ్మ, మాజీ మదర్ డైరీ డైరెక్టర్ సోమిరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ మల్లేష్, మాజీ ఎంపిటిసి మామిడాల అంజయ్య, మాజీ సర్పంచ్ పాండరి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జంగస్వామి, పార్టీ నాయకులు రఘుపతి రెడ్డి, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు మామిడాల భానుచందర్, వార్డు సభ్యులు మల్లేష్ సంపత్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

నాంపల్లి,మే,06(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక తహశీల్దార్ గూగులోతు దేవాసింగ్,



సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి సందర్శించడం జరిగింది. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ద్వారా తెలుసుకున్న సమస్యల పరిష్కారం కొరకై ఆర్డిఓ తో ఫోన్లో మాట్లాడారు. లారీలు త్వరగా వచ్చే విధంగా చూడాలని కోరారు. రైతుల నుంచి వచ్చిన ధాన్యం ఎప్పటికప్పుడు తేమ శాతం పరిశీలించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులను, ఐకెపి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించడం జరిగింది.

# రైతును రాజు చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సామెల్

తుంగతుర్తి, మే 6,(ప్రజా జ్యోతి):
ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతును రాజును చేయాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వ నడుస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు.ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు– మార్కెటింగ్ శాఖ ప్రగతి నివేదిక కార్యక్రమం బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జాతీయ గీతం ఆలపించిన అనంతరం మార్కెట్



కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతోపాటు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. అదేవిధంగా రైతులకు గోధుమ వరి మరియు ఇతర పంటల సాగు పద్ధతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాటించాల్సిన వ్యవసాయ విధానాలపై వివరాలు తెలియజేశారు. అందుబాటులో ఉన్న సబ్సిడీ పథకాలు, రైతు బీమా, పంట రుణాలపై పూర్తి సమాచారాన్ని రైతులకు అందించారు.అనంతరం ఎమ్మెల్యే సామెల్ మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వ నడుస్తుందని అన్నారు. రూ. లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి వేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తుంగతుర్తి, మద్దిరాల,నూతనకల్, తహసిల్దార్ లు దయానందం, సబిత, నూతనకల్ శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ బాబు, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేష్ కుమార్,ఏఈఓ లు, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా,తుంగతుర్తి మద్దిరాల నూతనకల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రేగటి రవి, పచ్చిపాల వెంకన్న, నల్లు రామచంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల వైపు

# రైతులు మొగ్గు చూపాలి: ఎమ్మెల్యే డాఆర్ భూపతి రెడ్డి





- ఏఎంసీలో నిర్వహించిన రైతు వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే
- రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత
- ప్రగతి నివేదికలు చదివి వినిపించిన అధికారులు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన
- సహకార సంఘాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని వెల్లడి
- డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచన
- ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపాలి
- రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- అభిప్రాయాలు వ్యక్తం చేసిన రైతులు
- ప్రభుత్వం కల్పించే సదుపాయాల పై హర్షం
- రైతు వారోత్సవాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

**నిజామాబాదు రూలర్ ( ప్రజా జ్యోతి )మే 6** రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు పండిస్తే మంచి లాభాలు వస్తాయని ఆ దిశగా అన్నదాతకు పంటలు సాగు చేయాలని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతు వారోత్సవ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ లో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి నేతృత్వంలో నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ సహకార సంఘాల అధికారులు తమతమ పరిధిలో రైతుల సంక్షేమార్థం చేపట్టిన కార్యక్రమాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాలతో పాటు స్వల్పకాలిక రుణాలు అందజేయడం జరిగిందని అధికారులు వివరించారు.అటు రైతులకు ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు.అంతకుముందు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ.. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు కావలసిన అన్ని రకాల వెసులుబాటులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ లో అన్ని ఏర్పాటు కల్పించడం జరిగిందన్నారు. ఏవైనా లోపాలు ఉంటే వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. అటు జిల్లా జిల్లా రైతులకు విస్తృత సూచనలు చేశారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకుని సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణమైన పంటలను సాగు చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. కూరగాయలు,ఉద్యానవన పంటలు, ఇతరత్రా డిమాండ్ గల పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. పంటమార్పిడి ద్వారా భూసారం పెరుగుతుందని తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా సలహాలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు అందరు అందుబాటులో ఉన్నారని అన్నారు . ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని అనుకూలమైన పంటలను రైతులు పండించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటూ... ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో చైతన్యమైన రైతులు ఉన్నారని అందుకే జిల్లాకు వ్యవసాయ కళాశాలను కూడా మంజూరు చేయించడం జరిగిందని గుర్తు చేశారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయంలో అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,వైస్ చైర్మన్ రాంచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్,ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్, ఉమ్మాజి నరేష్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మోపాల్ సాయిరెడ్డి, ఆర్మూర్ బాల్ రాజు, డివిజన్ నంబర్ 1 కార్పొరేటర్ అగ్గు భోజన్న, ఫిషరీస్ శ్రీనివాస్,హన్మండ్లు, మోహన్, చెలిమె శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు , వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణానికి భూమి పూజ



**నందిపేట్:** పుస్తక పఠనం ద్వారా మేధస్సు పెరుగుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. నందిపేట్ గ్రామంలో బుధవారం గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతి రెడ్డి రాజిరెడ్డి తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ భవనానికి ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం సిలిందర్ లింగం, ఉప సర్పంచ్ చందర్, మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిరికొండ తెలంగాణ

## ఆదర్శ పాఠశాలలు శిక్షణ శిబిరం



**సిరికొండ ( ప్రజా జ్యోతి )మే 6** సిరికొండ పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల సిరికొండలో జిల్లా విద్యా అధికారి ఆదేశానుసారం ఈనెల 11 నుండి 25 మే వరకు వేసవి శిక్షణ శిబిరంను నిర్వహించనున్నారు సిరికొండ మండలంలోని 6వ తరగతి నుండి9వ తరగతి కి చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థులతో పాటు ఇతర పాఠశాల విద్యార్థులు కూడా శిక్షణ పొందవచ్చు, క్రీడలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, మొదలగు అంశాలపై శిక్షణ ఉండండి 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడును, ఆసక్తి గల విద్యార్థులు పాఠశాలలో సంప్రదించాల్సిందిగా లేదా 9290559309, లేదా9490771237 ఫోన్ నెంబర్ లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపల్ రాజేష్ రెడ్డి తెలిపారు

### తెలంగాణ గ్రామీణ బ్యాంకు


## ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన సదస్సు



**సిరికొండ ( ప్రజా జ్యోతి )మే 6** సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో సి ఎఫ్ ఎల్ ఆధ్వర్యంలో మరియు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది మరియు దీని ముఖ్య ఉద్దేశం ప్రధానమంత్రి స్కీమ్స్ ప్రతి ఒక్కరు చేయించుకోవాలి అని మరియు కేవైసీ వికేవైసీ ఇన్సూరెన్స్ హౌసింగ్ లోన్ మరియు క్రాఫ్ లోన్ అందరు వినియోగించుకోవాలని సి ఎఫ్ ఎల్ పి శ్రీనివాస్ తెలిపారు మరియు టి జి బి మేనేజర్ టి శ్రీనివాస్ మరియు సర్పంచ్ సంద్ర లతా శంకర్ గారు మరియు ఉప సర్పంచ్ రొక్కం సంపత్ గారు అటెండ్ కావడం జరిగింది మరియు బ్యాంకింగ్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలియజేయడం జరిగింది.

### 10000 డిమాండ్ చేస్తూ.రూ.7,000 లంచం

## తీసుకుంటూ ఎస్సై భాస్కర్ చారి అరెస్ట్: ఏసీబీ ట్రాప్




**ప్రజా జ్యోతి. బోధన్ మే. 6.** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం నిర్వహించిన ట్రాప్ ఆపరేషన్‌లో ఎస్సై భాస్కర్ చారి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఒక కేసులో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.7,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ముందస్తుగా ప్రణాళిక రూపొందించి, నిర్ణయించిన ప్రదేశంలో ట్రాప్ ఏర్పాటు చేశారు. లంచం తీసుకుంటున్న సమయంలో ఎస్సైని పట్టుకుని, అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన బోధన్ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరించారు.



## నాగిరెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీధర్ గౌడ్



**నాగిరెడ్డిపేట్,మే6(ప్రజాజ్యోతి):** నాగిరెడ్డిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా శ్రీధర్ గౌడ్ నియామకం అయ్యారు.ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి, రెండవ సారి నన్ను మండల అధ్యక్షుడిగా నియమించినందుకు గాను ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావుకు,కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.కొత్తగా నియమితులైన అధ్యక్షులు తక్షణమే బాధ్యతలు స్వీకరించి, గ్రామ స్థాయి వరకు పార్టీని విస్తరించేందుకు కృషి చేయాలని పార్టీ నాయకత్వం సూచించిందని,కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకం ఉంచి,నాకు అవకాశం ఇచ్చినందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## గూడెం గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

– మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం – సర్పంచ్ యాదగిరి గౌడ్



**కామారెడ్డి రూరల్ మే 6, ప్రజాజ్యోతి** కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ యాదగిరి గౌడ్ నాయకత్వం వహించి గ్రామంలోని అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత, గౌరవప్రదమైన జీవనానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి అర్హురాలికి ఇందిరమ్మ చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.గ్రామంలోని మహిళలు ఈ చీరల పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తమ కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై చీరలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ మహిళా సంఘాల సభ్యులు, సంఘ మహిళా అధ్యక్షులు, సి.ఏలు, వి.ఓ.ఏలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో సంక్షేమ పథకాల అమలులో గూడెం గ్రామం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు

## క్యాసంపల్లి రైతు వేదికలో రైతు వారోత్సవం

– పాల్గొన్న ఏఈఓలు తేజస్విని

– ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతులకు శాస్త్రీయ వ్యవసాయ అవగాహన





**కామారెడ్డి రూరల్ మే 6 ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, రైతుల అభివృద్ధి మరియు వ్యవసాయ రంగ పురోగతిని లక్ష్యంగా పెట్టుకుని "రైతు వారోత్సవం" కార్యక్రమాన్ని ఈ నెల 06-05-2026 తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం క్యాసం పల్లి రైతు వేదిక కార్యాలయంలో ఉదయం 10:00 గంటలకు ప్రారంభం కానుంది. వ్యవసాయ రంగంలో రైతులకు ఆధునిక సాంకేతికతలు, శాస్త్రీయ పద్ధతులు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే రైతులకు వ్యవసాయ శాఖ నిపుణులు పలు కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు.ప్రధానంగా రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ ద్వారా భూమి సారాన్ని ఎలా కాపాడుకోవాలి, సమతుల ఎరువుల వినియోగం ద్వారా ఖర్చులను తగ్గించి దిగుబడులు ఎలా పెంచుకోవాలి, సహజ వ్యవసాయం పద్ధతులతో ఆరోగ్యకరమైన పంటల సాగు ఎలా చేయాలి, నాణ్యమైన విత్తనాల వినియోగం వల్ల లభించే ప్రయోజనాలు, పంట రుణాల సద్వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా ఆధునిక పరికరాల వినియోగం వంటి అంశాలపై విపులంగా వివరించనున్నారు. అదేవిధంగా పంటల దిగుబడులు పెంపు, పెట్టుబడుల తగ్గింపు, వాతావరణ మార్పులకు అనుగుణమైన సాగు విధానాలు, ప్రభుత్వ పథకాల వినియోగం వంటి అంశాలపై కూడా రైతులకు మార్గనిర్దేశనం చేయనున్నారు. వ్యవసాయ నిపుణులతో ప్రత్యక్షంగా మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కూడా రైతులకు కల్పించబడనుంది. ఈ కార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవగాహన చేసుకుని, శాస్త్రీయ విధానాలను అనుసరించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.కావున క్యాసం పల్లి మరియు పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వ్యవసాయ శాఖ అందించే సూచనలు, సలహాలు తెలుసుకొని తమ వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమం రాష్ట్ర అభివృద్ధికి పునాది అని ప్రభుత్వం భావిస్తూ రైతుల కోసం ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు.

### క్యాసంపల్లి గ్రామంలో

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ

– మహిళా సాధికారతకు గ్రామ పంచాయతీ ప్రాధాన్యం – సర్పంచ్ అడప శ్యామ్



**కామారెడ్డి రూరల్ మే 6, ప్రజాజ్యోతి** కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో మహిళల అభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం మరియు గ్రామ మహిళలకు శాశ్వత వేదిక కల్పించేందుకు నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి ఘనంగా భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అడప శ్యామ్ ప్రధాన అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ అడప శ్యామ్ మాట్లాడుతూ గ్రామ మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా సమాఖ్య భవనాన్ని నిర్మించడం గ్రామానికి గర్వకారణమని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, పొదుపు సంఘాల నిర్వహణ, ఉపాధి కార్యక్రమాల కోసం ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే గ్రామ సమగ్రాభివృద్ధికి పునాది అని ఆయన అన్నారు.ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణం గ్రామ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఈ భవనం కీలకంగా మారుతుందని చెప్పారు.గ్రామ మహిళా అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామంలో మహిళల కోసం ప్రత్యేక సమాఖ్య భవనం నిర్మాణం జరగడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు, సి.ఏలు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువత, పెద్దలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళా సాధికారతకు దోహదపడే ఈ నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత చురుకుగా సాగుతాయని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

### శ్రీ మరకత ఆత్మలింగేశ్వర స్వామి

## దివ్య ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం అందజేత



**నాగిరెడ్డిపేట్,మే6(ప్రజాజ్యోతి):** తెలంగాణ శాసనసభలో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న బేతి వీరారెడ్డిను కామారెడ్డి జిల్లా ఆత్మకూరు గ్రామంలో శ్రీ మరకత ఆత్మలింగేశ్వర స్వామి దివ్య ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 13 నుంచి 15 వరకు కొనసాగే బృహత్తర కార్యక్రమానికి హాజరు కావాలని మాజీ జడ్పీటీసీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి ఈ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# కౌడిపల్లి మార్కెట్ యార్డ్‌లో చలివేంద్రం ప్రారంభం

మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్







**కౌడిపల్లి ప్రజా జ్యోతి, మే 6:** వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కౌడిపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు మండిపోతున్న ఈ కాలంలో మార్కెట్‌కు వచ్చే ప్రజలు, రైతులు, కూలీలు, వ్యాపారులు, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చలివేంద్రం ద్వారా రోజూ మార్కెట్‌కు వచ్చే వందలాది మంది ప్రజలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గ్రామపంచాయతీ బాధ్యత అని అన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని, సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ ముందుండాలని పిలుపునిచ్చారు. వేసవి కాలంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, సేవాసంస్థలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, వార్డు సభ్యులు మక్బూల్, దేవేందర్, లక్ష్మి, శరత్ కుమార్, మంగళపర్తి సందీప్, ప్రశాంత్, బొంతమ్మ సంగప్ప పాల్గొన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొడ శ్రీనివాస్ గుప్తా, వెంకటేశం గుప్తా, కుర్మ లక్ష్మణ్, జిల్లా నాయకులు రాగుల భూమయ్య, పటేల్ తిరుమలేష్, ఉడుత రాజు, ఉడుత మురళి, సాలె దుర్గయ్య, పాషా, యాదుల్, దార అనిల్ కూరగాయల వెంకటేశం, బాబుమియా కారోబర్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

### ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాతిప్రాదికన సంగారెడ్డి

# జిల్లాలో గల తారా డిగ్రీ కాలేజ్‌లో మెగా జాబ్ మేళా

– జిల్లాలో గల గ్రామాలలో ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– జాబ్ మేళా పోస్టర్ను ఆవిష్కరించిన కలెక్టర్ – జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ (ప్రజాజ్యోతి ) 06 మే :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో తేదీ: 08-05-2026 న ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాతిప్రాదికన సంగారెడ్డి జిల్లా లో గల తారా డిగ్రీ కాలేజ్ లో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుంది. దీనికి సంబందించిన పోస్టర్ను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గల ఎంపిడిఓ లు పంచాయత్ సెక్రటరీల ద్వారా గ్రామాలలో చాటింపు చేయించాలని, మెదక్ జిల్లాలో గల గ్రామాలలో ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **satg.telangana.gov.in/prajapalana** 3 వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకొని 08-05-2026 రోజున సంగారెడ్డి జిల్లా లో గల తారా డిగ్రీ కాలేజ్ లో జరిగే మెగా జాబ్ మేళాలో పాల్గొనాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ ఎల్లయ్య , సీఈఓ , జిల్లా పరిషత్, యాదయ్య గారు, జిల్లా పంచాయత్ అధికారి, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల , ఉపాధి కల్పన అధికారి రామరాజు , పరిశ్రమల శాఖ అధికారి ప్రకాశరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎంపిడిఓ లు, తహసీదార్లు పాల్గొన్నారు.

# ఐకేపీ, పిఏసీఎస్ కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ

– వెల్దుర్తి తహసిల్దార్ శ్రీనివాస్ చారి





**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) మే 06:** వెల్దుర్తి మండలంలో రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మండల తహశీల్దార్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. బుధవారం ఆరెగూడెం, చర్లపల్లి, వెల్దుర్తి గ్రామాల్లో ఐకేపీ, పిఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి, అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు అవసరమైన త్రాగునీరు, టెంట్లు, తేమ శాతం కొలిచే పరికరాలు, వర్షాల సమయంలో ధాన్యం రక్షణకు టార్పాలిన్లు ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే లారీల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు రాస్తారోకో

– రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



**నంగునూరు, మే 6(ప్రజా జ్యోతి):-** మండల పరిధిలోని తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన రైతులు దాన్యాన్ని ప్రభుత్వం వెంటనే ధాన్యం ను కొనుగోలు చేయాలని, తాలు పేరుతో రైతులను మిల్లర్ల వేడిస్తున్నారు వెంటనే మిల్లార్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం నాడు సిద్దిపేట నుండి హనుమకొండ వెళ్లే జాతీయ రహదారిపై ముంద్రాయి వద్ద రైతులు బైఠాయించి నిరసన తెలిపారు విషయం తెలుసుకున్న రాజగోపాల్పేట ఎస్సై వివేక్ ,పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి సంబంధిత అధికారులతో మాట్లాడించి రైతులను ఆందోళన విరమింప చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులు కావస్తుంది. ఇప్పటివరకు రెండు లారీలు ధాన్యాన్ని క్లీన్ చేసి వ్యవసాయ అధికారి సెలెక్ట్ చేసి ధాన్యం సేకరించి మిల్లుకు పంపగా తాలు పేరుతో గత మూడు రోజులుగా ధాన్యం దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తా ఉన్నారు. గ్రామంలో మూడు రోజులుగా ధాన్యం కొనుగోలు నిలిపేశారు. ధాన్యాన్ని బి గ్రేడ్ లో సెలెక్ట్ చేసినప్పటికీ మిల్లర్లు ఇబ్బందులకు చేయడం చాలా బాధాకరమని , మంగళవారం నాడు రాత్రి కురిసిన వర్షానికి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు ఈ కార్యక్రమంలో రైతులు , తదితరులు పాల్గొన్నారు.





# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

– బాధితురాలికి రూ.2 లక్షల విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు – జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు




**మెదక్ (ప్రజాజ్యోతి ) మే 06 :** మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో 2019 లో మతిస్థిమితం లేని మైనర్ బాలికపై జరిగిన అమానుష లైంగిక దాడి కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు వెలువరించిన తీర్పు సమాజానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడు అర్కెల నాగేశ్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించడంతో పాటు, బాధితురాలి మానసిక వేదన, పునరావాసం దృష్ట్యా రూ.2,00,000 విక్టిమ్ కంపెన్సేషన్ మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మైనర్ బాలికపై జరిగిన దారుణం అత్యంత విషాదకరమని, ఆమె మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో గర్భవతి అయినా విషయాన్ని కూడా గుర్తించలేకపోవడం సమాజాన్ని కలచివేస్తుందని ఎస్పీ అన్నారు. ఆరు నెలల తర్వాత విషయం వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసి, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుతం బాధితురాలికి 7 సంవత్సరాల వయస్సు గల కుమారుడు ఉన్నాడని తెలిపారు. దాదాపు ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో ప్రజా అభియోగాధికారి బాలయ్య సమర్థంగా వాదనలు వినిపించడం, భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ స్వేత బాధితురాలికి మానసిక ధైర్యం నింపి, ఆమె సాక్ష్యం చెప్పడనికి సిద్ధం చేసి కేసు విజయంలో కీలకమయ్యాయని అన్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె.సుభాష్ , దర్యాప్తు అధికారి డీఎస్పీ కిరణ్, లైజనింగ్ అధికారులు ఎసై విఠల్, కృష్ణ, కోర్టు సీడీఓ నాగరాజు అందరి కృషి అభినందనీయమని ఎస్పీ తెలిపారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం అత్యంత కఠినమైందని, ఇటువంటి నేరాలకు పాల్పడేవారికి తప్పనిసరిగా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. న్యాయం ఆలస్యమైనా తప్పక జరుగుతుందనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంగా ఇస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితురాలి ధైర్యం, అధికారుల నిబద్ధత, న్యాయవ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు కలిసొచ్చినప్పుడు నేరాలకు తావుండదని అన్నారు. చిన్నారి భవిష్యత్తు కాపాడటం మనందరి బాధ్యత అని పునరుద్ఘాటించారు.

# బాలల హక్కులను కాలరాస్తే ఉపేక్షించం

– రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి









**మెదక్ (ప్రజాజ్యోతి)** కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మెదక్ ,సిద్దిపేట,సంగారెడ్డి జిల్లాలో బాలకార్మిక వ్యవస్త, బాల్య వివాహాలు,డ్రగ్స్ నియంత్రణ,కిషోర బాలికల ఆరోగ్య అవగాహన ,విద్య అవగాహన, పాఠశాలల్లో డ్రాప్ ఔట్ తగ్గించడం, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, హాస్టల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు, సాధారణ ప్రసవాలు, పోక్సో కేసుల నమోదు వివరాలు, అతి ప్రమాద మైనర్ డ్రైవింగ్ అనే అంశాలపై ఉమ్మడి జిల్లా అధికారులనుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ..బాలలు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా ఎదగడానికి అవసరమైన అన్ని హక్కులను కాపాడటం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ స్పష్టం చేశారు. బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా, ఎలాంటి ఒత్తిడులు ఉన్నా కూడా కమిటీ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆమె గట్టిగా హెచ్చరించారు. చిన్నారులు మన సమాజానికి భవిష్యత్తు బలమైన స్థంభాలు. వారి శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడం అత్యవసరం. అయితే ఇటీవల కొంతమంది బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ బాలలపై దౌర్జన్యాలు, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, విద్యా హక్కుల నిర్లక్ష్యం వంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకరం అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..జిల్లాలో బాలల రక్షణ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా పనిచేసేలా సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లు, బాలల సంరక్షణ గృహాలు, అనాథాశ్రమాలు వంటి ప్రదేశాల్లో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తూ, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామని వెల్లడించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతీ ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు వందనా గౌడ్, చందన, సరిత, అపర్ణ, అగర్వాల్, వచన్ కుమార్ సిద్దిపేట డిఆర్ఓ నాగరాజమ్మ , మెదక్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సిద్దిపేట అడిషనల్ ఎస్పీ ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మెరుగైన సాగు పద్ధతులకై అవగాహన అవసరం

– తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత

– తొగుట మండలం చందాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహణ





**తొగుట, మే 06(ప్రజాజ్యోతి):** మెరుగైన సాగు పద్ధతులకై రైతులకు అవగాహన అవసరం ఎంతైనా ఉందని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత సూచించారు. బుదవారం చందాపూర్ గ్రామంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, సిద్ధిపేట జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో రాబోయే వానాకాలం సాగుకై రైతులను సమాయత్తం చేయడంతో పాటు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా. శ్వేత మాట్లాడుతూ రైతు సోదరులకు పంట పొలాల్లో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, నేల సంరక్షణకు పచ్చి రొట్టె ఎరువులు జనుము, జీలుగా, పెసర పంటను వేసవి కాలం లో వరి పంటకు ముందు సాగు చేసుకోవడం, యూరియా వాడకం తగ్గించాలని, జీవన ఎరువులు, పిఎస్బి వినియోగం లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టల ఉపయోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి వివరించామన్నారు. అనంతరం శాస్త్రవేత సరిత వివిధ వరి రకాలు కేఎన్ఎం-1638, బిపిటి-5204, డబ్ల్యుజిఎల్-44 సాగు అనుగుణం అని, వివిధ పంటలలో యూరియా మోతాదు, రైతులు విత్తనాలు కొన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా లాంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ రైతులు సలహాలు సూచనలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చని, ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ చందా లావణ్య, స్వామి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మరియు రైతులు పాల్గొన్నారు.

# సొసైటీ పాలకవర్గాలపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తాం

– సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి




**తొగుట, మే 06 (ప్రజాజ్యోతి):** సొసైటీ పాలకవర్గాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం 597 జీవో ద్వారా రాష్ట్రంలో ఉన్నటువంటి 911 మంది సొసైటీ చైర్మన్ లను తొలగించారని తెలిపారు. దీనిపై చైర్మన్లు అందరూ కలిసి హైకోర్టుకు ఆశ్రయించడం జరిగిందని, ఇదే విషయంపై హైకోర్టు జోక్యం చేసుకొని కొత్త పద్ధతిని రద్దుచేసి పాత పద్ధతిలో చైర్మన్ ను కొనసాగించాలని తీర్పునివ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. రైతుల సంక్షేమానికి సొసైటీ అహర్నిశలు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సొసైటీ ఆధ్వర్యంలో అండగా ఉంటామని పేర్కొన్నారు. సొసైటీ పాలకవర్గాలు ఉంటేనే రైతులకు సరైన సేవలు అందుతాయని అన్నారు. సొసైటీలకు పాలకవర్గం లేకపోవడం వలన రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నారాయణరెడ్డి, శ్రీధర్, మహిపాల్ రెడ్డి, సీఈఓ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూంపల్లి గ్రామంలో భారీ అగ్ని ప్రమాదం



**మిరుదొడ్డి, మే 6, (ప్రజా జ్యోతి):** అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొమ్మర శ్రీకర్ నివాసంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఒక్కసారిగా ఇంట్లో మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమయ్యారు. జెసీబీ సహాయంతో ఇంటి తలుపులు పగలగొట్టి, మంటలను ఆర్పేందుకు స్థానికులు స్వయంగా ప్రయత్నించారు. అయితే మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించారు. అప్పటికే ఇంట్లోని ఫర్నిచర్, బట్టలు, ఇతర విలువైన సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంటిని కోల్పోయిన కుటుంబ సభ్యులు రోడ్డున పడి బోరున విలపించారు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా? లేక ఇతర కారణాల వల్ల జరిగిందా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## ఆడపడుచు వివాహానికి పుస్తె మెట్టెలు

**- పెళ్లి కూతురు తల్లిదండ్రులకు అప్పగించిన సర్పంచ్ దంపతులు**




**తాండూరు, మే 6 ప్రజాజ్యోతి :** తాండూర్ మండలం సిరిగిరిపేట గ్రామానికి చెందిన కర్కుముక్కుల దుర్గమ్మ జగ్గప్ప దంపతుల కూతురు అక్షిత వివాహం రంగారెడ్డి జిల్లా చౌదరిగుడా కాసులబాద్ గ్రామానికి చెందిన పద్మ, వెంకటయ్య ల కుమారుడితో వివాహం జరిగింది. ఈ సందర్భంగా పెళ్లికూతురుకు కావలసిన తాళిబొట్టు కాలి మెట్టెలు కానుకగా ఇవ్వాలని పెళ్లికూతురు తల్లిదండ్రులు గ్రామ సర్పంచు దంపతులు సుమలత, పరశురాం లను కోరడంతో వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ దంపతులు పెళ్లికూతురుకు కావలసిన పుస్తె మెట్టెలు బుధవారం రోజు స్థానిక కట్ట మైసమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి పెళ్లికూతురు తల్లిదండ్రులు దుర్గమ్మ, జగ్గప్పలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తాళిబొట్టు కాలి మెట్టెలు నూతన దంపతులకు అందజేయడం చాలా సంతోషకరమైన విషయమని చెప్పారు. ఎంతోమంది పేదలకు పెద్దన్నయ్యగా నూతన దంపతులకు పుస్తె మెట్టెల కానుక లను అందజేస్తున్న సర్పంచు దంపతులను పలువురు గ్రామస్తులు బంధువులు ప్రశంసిస్తున్నారు. ఎన్నడు లేని విధంగా సర్పంచ్ కుటుంబం నుండి ఆడపడుచుల వివాహానికి ఇంతటి పవిత్రమైన తాళిబొట్టు కాలిమెట్టెలు అందజేయడం ఆదర్శనీయమని చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పప్పి, పెద్దలు లక్ష్మప్ప, వీరప్ప, వెంకటప్ప, తదితరులు ఉన్నారు.

## ఎల్మకన్య కోఆపరేటివ్ సొసైటీ పిఏసి కమిటీ చైర్మన్గా రవి గౌడ్ బాధ్యతలు

**- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా సహకార సంఘం కమిషనర్**
**- రైతులకు సేవలందించ డంతోనే మళ్లీ అవకాశం వచ్చింది**
**- పిఏసి కమిటీ చైర్మన్ రవిగౌడ్**




**తాండూరు మే 6 ప్రజా జ్యోతి :** గత నాలుగు నెలల క్రితం 19 డిసెంబర్ 2025న రద్దైన పిఎసిఎస్ పాలక వర్గానికి మరో అవకాశం లభించింది. తాజాగా రాష్ట్ర సహకార సంఘం కమిషనర్ ద్వారా ఇది వరకు రద్దైన (పిఎసిఎస్ )ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిటీలకే పీఏసీ కమిటీలుగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం రోజు పిఏ సి కమిటీ చైర్మన్గా రవి గౌడ్ బాధ్యతల స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో రైతులకు అందుబాటులో ఉండి సేవలందించడంతోనే మరోసారి ఈ అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పిఏసి కమిటీల నియమ నిబంధనల ప్రకారం సొసైటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఏసి కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, అమృతయ్య, పార్వతమ్మ, పెంట నర్సింలు, రాఘవేందర్, వెంకట్ రాం రెడ్డి, పన్నిబాయి, అనంతమ్మ,సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## తిమ్మాపూర్లో కోస్గి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిసి రోడ్లు ప్రారంభం

**- రూ.5 లక్షలతో సిసి రోడ్ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్**




**కొత్తూర్ మే 06 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో మూడో వార్డ్ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిసి రోడ్ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ..పట్నం చంద్రయ్య ఇంటి నుండి పట్నం నరసింహ ఇంటి వరకు రోడ్డు పనులు వేస్తున్నట్లు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ,కౌన్సిలర్స్ మాధవి గోపాల్ గౌడ్,చంద్రకళ రాజేందర్ గౌడ్,ప్రసన్న లత యాదయ్య, నాయకులు పెద్దపురం కృష్ణయ్య, నరసింహ, యాదయ్య,పట్నం చంద్రయ్య, దశరథ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్, దాన్ రాజ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




**ఉప్పల్ ఏప్రిల్ 6, ప్రజా జ్యోతి :** కాప్రా వెస్టన్ బ్లిస్లో మెహర్ బాబా యూజీడీ పనులకు సుమారు రూ.46 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) పనులను ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు ఈ యూజీడీ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రాంతంలో కాలుష్య సమస్యలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అన్ని విధాలా అండగా ఉంటాం అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బైరి నవీన్ గౌడ్ కాలనీ వాసులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ రెవెన్యూ ఉద్యోగులకు అన్యాయం - జి.విజయేందర్

**- రెవెన్యూ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షులు వికారాబాద్ జిల్లా**
**- బదిలీలలో పారదర్శకత కోరుతూ ట్రెసా ఆందోళన**



**పరిగి, మే 06 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగులపై సాధారణ బదిలీలలో వివక్ష జరుగుతోందని ట్రెసా (రెవెన్యూ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు జి. విజయేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జోనల్ పోస్టులుగా ఉన్న నాయబ్ తహసీల్దారులు, సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న బదిలీ విధానాలు అన్యాయానికి దారి తీస్తున్నాయని ఆయన తెలిపారు. ఒకే స్టేషన్లో నాలుగు సంవత్సరాలు పూర్తి కాలేదనే కారణంతో వికారాబాద్ జిల్లా ఉద్యోగులను బదిలీలకు అనర్హులుగా ప్రకటించడం సరైంది కాదని విమర్శించారు. సాధారణంగా రెండు నుంచి మూడు సంవత్సరాల తర్వాతే అంతర్గత బదిలీలు జరుగుతున్నప్పటికీ, ఈ నిబంధనను సాకుగా చూపుతూ చార్మినార్ జోన్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలకు వికారాబాద్ ఉద్యోగులను పంపడం లేదని ఆరోపించారు. ఇది వికారాబాద్ జిల్లా ఉద్యోగులపై స్పష్టమైన వివక్షగా కనిపిస్తోందని ఆయన అన్నారు. గత బదిలీలలో వికారాబాద్ నుండి 40 మందికి పైగా ఉద్యోగులను హైదరాబాద్కు పంపగా, అక్కడి ఉద్యోగులను వికారాబాద్కు తీసుకొచ్చినప్పటికీ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు మాత్రం బదిలీలు జరగలేదని గుర్తు చేశారు. అందువల్ల జోనల్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు జిల్లా స్టేషన్గా పరిగణించి బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వికారాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి, స్పీకర్ స్పందించి న్యాయం చేయాలని రెవెన్యూ ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారని తెలిపారు. ఈ విషయంపై సీసీఎల్ఏ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని వికారాబాద్ జిల్లా ఉద్యోగులకు న్యాయం చేయాలని ట్రెసా నాయకులు డిమాండ్ చేశారు.

## సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే బీఎంఆర్





**యాలాల్ (మే 06) ప్రజా జ్యోతి :** పేదల సొంతింటి కలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు,యాలాల మండలం చెన్నారం,ఎన్కేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

చెన్నారం గ్రామానికి చెందిన శామలమ్మ-మల్లయ్య, సత్యమ్మ-సత్యయ్య, రాసమ్మ-సాయిలు, శివలీల-పరుశురాం కుటుంబాల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్కేపల్లి గ్రామంలో వెంకటమ్మ-రాములు కుటుంబం గృహప్రవేశ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని తెలిపారు. సొంత ఇల్లు కల నెరవేరినందుకు లబ్ధిదా రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చేర్మెన్ పట్లోళ్ల నర్సిములు,యాలాల్ సహకార సంఘం మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వీరేశం సీనియర్ నాయకులు చెన్నారం అనిల్ కుమార్ గుప్తా హన్మంత్ ముదిరాజ్, మొగులప్ప వివిధ గ్రామల సర్పంచ్లు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

**- మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు - మక్తగూడలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు**





**కొత్తూర్ మే 06 (ప్రజా జ్యోతి) :** పేదల ఆరోగ్య పరిరక్షణకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం కొత్తూరు మండలంలోని మక్తగూడలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ బోకుల శ్రీరాములు హాజరై రిబ్బన్ కత్తిరించి హెల్త్ క్యాంపును ప్రారంభించారు. డాక్టర్ బృందం పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములు గౌడ్,గ్రామ సెక్రెటరీ రవణీల, గ్రామ కమిటీ అధ్యక్షుడు దయ్యాల శ్రీను, వార్డ్ సభ్యులు కృష్ణ, రాజు, చందర్, అంజయ్య,రాందాస్ నాయక్, దయ్యాల మల్లేష్, వైద్యులు డాక్టర్ సరిత, సిహెచ్ఓ నాగేష్, ల్యాబ్ టెక్నీషియన్ శివశంకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, జయమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన డీజీపీ ఆనంద్కు శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ ఏప్రిల్ 6, ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా పదవి బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ఐపిఎస్ హైదరాబాదులోని డిజిపి ఆఫీసులో మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ లో కోటి 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టబోయే స్టోన్ వాటర్ డ్రైనేజ్ పనులకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి, వెంటనే పనులు ప్రారంభం చేయడానికి జైల్ శాఖ డీజీ కీ సూచించవలసినది గా ఆయన కోరారు ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రాంతాల్లో వరద నీటి నిల్వ సమస్యలు తగ్గి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటు లోకి వస్తాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు అలాగే, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దిష్ట కాలపట్టికలో పనులు పూర్తి చేయడానికి సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులకు సహకరించ వలసినదగా జైళ్ల శాఖ అధికారులను ఆదేశించవ లసినది కోరారు ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్య మని, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిస్పష్టం చేశారు.

## బండారి భారతమ్మ దశదిన కర్మలో పాల్గొన్న పరమేశ్వర రెడ్డి



**ఉప్పల్ ఏప్రిల్ 6, ప్రజా జ్యోతి :** ఉప్పల్ నియోజకవర్గ నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారి శ్రీకాంత్ గౌడ్ నానమ్మ భారతమ్మ దశదిన కర్మలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలువేసి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.




## పెట్లోజు వెంకటాచారి స్మారక పురస్కారం అందుకున్న దరువు అంజన్న

**- అంజన్న కళారంగానికి చేసిన సేవ ఎంతో గొప్పది: విమలక్క**
**- ప్రజా వాగ్గేయకారుడు దరువు అంజన్న: ప్రీతం**
**- నిస్వార్థ సామాజిక సేవకుడు అంజన్న**
**- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**





**కుత్బుల్లాపూర్ మే 6(ప్రజా జ్యోతి) :** కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ జిల్లా ఏడవ వార్షికోత్సవం సందర్భంగా కవి హృదయం సాహిత్య వేదిక వారిచే అభ్యుదయ కవి ఆదర్శ ఉపాధ్యాయుడు శ్రీ పెట్లోజు వెంకటాచారి స్మారక పురస్కారం 2026కు గాను ప్రజా వాగ్గేయకా రుడు, తెలంగాణ ఉద్యమ నేత తెలంగాణ ప్రభుత్వ టూరిజం మరియు సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్నకు అరుణోదయ సంస్కృతిక సమస్య జాతీయ అధ్యక్షురాలు విమలక్క చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ దరువు అంజన్న తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశాడని ముఖ్యంగా కళారంగానికి ఎంతో సేవ చేశారు అని కొనియాడారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలం గాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దరువు అంజన్న సమాజానికి నిస్వార్థంగా ఎంతో సేవ చేశాడని అతని సేవలను కొనియాడారు. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాళ్లకు గజ్జె కట్టి బహిరంగ వేదికలపైన అంజన్న పాడుతుంటే చూసి మురిసే వాడినని ఇప్పుడు ఈ పురస్కారం అందుకోవడంలో నేను భాగస్వామ్యం కావడం సంతోషమని అన్నారు. దళిత కళామండలి జాతీయ అధ్యక్షుడు మాస్టర్ జి మాట్లాడుతూ దరువు అంజన్న గత 30 సంవత్సరాలుగా నాకు తెలుసునని మా గజ్వేల్ ప్రాంత వాసేనని చిన్నప్పటినుండి అంజన్న సమాజానికి ఎంతో సేవ చేసాడని అందుకే అంజన్న చాలామందికి ఆదర్శం అని కొనియాడారు. తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పద్మాచారి మాట్లాడుతూ అంజన్న లాంటివారు మా విశ్వకర్మ సమాజంలో జన్మించడం హర్షించదగ్గ విషయమని, అంజన్న సేవలు విశ్వకర్మ సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రతాప్ మాట్లాడుతూ ఈ రోజుల్లో దరువు అంజన్న లాంటి నిస్వార్థ ఉద్యమకారుడు చాలా అరుదు అని అంజన్న లాంటివాళ్ళు రేపటి సమాజానికి ఎంతో అవసరమని ఆశాభావం వ్యక్తం చేశారు. కవి హృదయం సాహిత్య వేదిక జనగామ జిల్లా అధ్యక్షులు పెట్లోజు సోమేశ్వర చారి మాట్లాడుతూ మా నాన్నగారైన పెట్లోజు వెంకటాచారి స్మారక పురస్కారం 2026 కు గాను ప్రజా వాగ్గేయకారులు అయినా దరువు అంజన్నకు ఇవ్వడం నాకు సంతోషాన్ని కలగజేసిందని అన్నారు. పురస్కార గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ పెట్లోజు వెంకటాచారి స్మారక పురస్కారానికి నన్ను ఎంపిక చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఈ పురస్కారంతో ఈ సమాజం పట్ల కళల పట్ల నాకు ఎంతో బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు నర్సిరెడ్డి, ప్రముఖ కవి కళాకారులు జీ.వై కృష్ణ సంగీత దర్శకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్కు ప్రధాని మోదీ రాక

**- 7,823 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**
**- బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి**



**పరిగి, మే 06 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ అభివృద్ధి పథంలో మరో కీలక ఘట్టంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల మే 10న హైదరాబాద్కు రానున్నారని బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి తెలిపారు. మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రానికి ఆయన చేస్తున్న తొలి పర్యటన కావడం విశేషంగా అభివర్ణించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఈ పర్యటనలో భాగంగా సుమారు ?7,823 కోట్ల వ్యయంతో పలు కీలక అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. రవాణా రంగంలో కాజీపేట--విజయవాడ మూడవ రైల్వే లైన్ ప్రారంభం, మహబూబ్నగర్ ప్రాంతంలో జాతీయ రహదారి పనుల ప్రారంభం జరగనుండగా, పారిశ్రామికాభివృద్ధిలో జహీరాబాద్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, వరంగల్ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పనులకు వేగం పెరుగనుందని అన్నారు. విద్యా, వైద్య రంగాల్లో ములుగులో సమ్మక్క-సారక్క గిరిజన విశ్వవిద్యాలయం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పాటు బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారని తెలిపారు. అదేవిధంగా మల్లాపూర్లో నిర్మించిన పెట్రోలియం టెర్మినల్ను కూడా ప్రారంభించను న్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. "డబుల్ ఇంజిన్ వృద్ధి - వికసిత తెలంగాణే లక్ష్యం" అనే నినాదంతో ఈ సభ జరగనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వినాలని మారుతి కిరణ్ బూనేటి పిలుపునిచ్చారు.

## రిజర్వ్ ఫారెస్ట్లో మురుగునీటి సమస్యపై అధికారుల తనిఖీలు




**అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 06 (ప్రజాజ్యోతి) :** హెచ్ఎం డబ్ల్యు ఎస్ఎస్బి ఎండి అశోక్ రెడ్డి(ఐఏఎస్), ఈఎండబ్ల్యూ ఎస్ఎస్బి ఈడి పంకజ, ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో(ఐఏఎస్), హయత్ నగర్ డిప్యూటీ కమిష నర్ ఎం.ఎం.సి, ఇతర అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ లో మురుగునీటి సమస్యను పరిశీలించేందుకు వారు ఆకస్మిక తనిఖీని చేపట్టారు.అక్కడ మురుగునీటి నీటి సమస్య తీవ్రతను, సమస్య పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై వారు చర్చించారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి :** ఎల్బీ నగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ వికాస్ మహతోను మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ కలుసుకుని కొత్తపేట డివిజన్లో రోడ్ల దుస్థితిపై వినతిపత్రం సమర్పించారు. శ్రీ రామలింగేశ్వర కాలనీ, న్యూ సమతాపురి కాలనీ, మారుతీనగర్ బుర్జు మైసమ్మ దేవాలయం పరిసరాలు మరియు ఓల్డ్ విలేజ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు సీసీ మరియు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

## ఈనెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాక



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో నాగోల్ డివిజన్లో బీజేపీ నేతలు కరపత్రాలు పంపిణీ చేశారు. మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకావాలని సామ రంగారెడ్డి, చింతల సురేందర్ యాదవ్ కాలనీ వాసులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సిద్దాల ఐలయ్య మల్లేష్ రావుల శ్రీనివాస్ శ్యామ్ కుమార్ కేసిరెడ్డి పద్మారెడ్డి గోపాల్ శర్మ విజయ్ శివ శంకర్ నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు కలెక్టర్ అభినందనలు

కరీంనగర్ బ్యూరో, మే 6 (ప్రజాజ్యోతి ): పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన బాలసాధనం విద్యార్థినులను



జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. తిమ్మాపూర్ కేజీబీవీ చదువుతున్న కే సాధన 536 మార్కులు సాధించింది. అదేవిధంగా ఇదే స్కూల్లో చదువుతున్న ఎం హారిని 516 మార్కులు సాధించింది. ఆరేపల్లి జెడ్పిహెచ్ఎస్ స్కూల్లో చదువుతున్న కే హారినీ 298 మార్కులు సాధించింది. ఈ ముగ్గురు విద్యార్థినుల ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అభినందించారు. ఉన్నత చదువులు చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి యం. సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) దుర్దాన పర్వీన్, శాంత, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కరాటే, కుంగ్ ఫూ శిక్షణ ప్రారంభం

ఎండపల్లి, మే 6,ప్రజా జ్యోతి : మండలంలోని కొత్తపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ జి రెడ్డి మహేందర్రెడ్డి ఆధ్వర్యంలో సొంత నిధులతో గ్రామంలోని 8 సంవత్సరాలు పై బడిన పిల్లలకు ఉచిత కరాటే కుంగ్ ఫూ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం రోజున ప్రారంభించారు,ఈ సందర్భంగా జె ఎం ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు , గ్రామ




సర్పంచ్ జి రెడ్డి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ,వేసవి సెలవుల నేపథ్యంలో ఆరోగ్యం, ఆత్మరక్షణ, శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం, మానసిక ఉల్లాసం కోసం కరాటే నేర్చుకోవడం అవసరమని రాజ మల్లయ్య మాస్టర్ ల పర్యవేక్షణలో కరాటే కుంగ్ ఫు శిక్షణ కార్యక్రమం ,రాబోయే జూన్ 15 నాటికి కొనసాగుతుం దని,తెలిపారు,కాగా అతికొద్ది కాలంలోనే చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అన్ని వర్గాలకు , ఏది అవసరమో తెలుసుకొని అడిగిందే తడావుగా, అన్నీ చేస్తున్న గ్రామ సర్పంచ్ పై పలువురు అభిమానులు గ్రామస్తుల నుండి అభినందనలు వెలువెత్తుతున్నాయి,

## సహకారంతో రైతుకు నూతన దిశ

కొడిమ్యాల,మే 06,(ప్రజాజ్యోతి): 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్క రించుకుని చొప్పదండి నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు బుధవారం



మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. జిల్లా సహకార శాఖ, మండల సహకార సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయ రంగ బలోపేతంలో సహకార సంస్థల పాత్రను వివరించారు.
జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ రమేష్, ఎంఏఓ జ్యోతి, ఉద్యానవన అధికారి శ్యామ్ ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం,మాజీ ప్యాక్స్ చైర్మన్ రాజనర్సింగరావు, బ్యాంకు అధికారులు, ఏఈఓలు, సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డికి వెలుగు సిబ్బంది ఘన సన్మానం

కాల్వ శ్రీరాంపూర్ మే 6 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని .సింగిల్విండో కార్యాలయంలో .చైర్మన్ చదువు రామచంద్రారెడ్డికి. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా. బుధవారం రోజున. వెలుగు. సిబ్బంది. శాలువలతో ఘనంగా సన్మానించి .అభినందించారు. ఈ కార్యక్రమంలో. సి.సి శారద. ఎమ్మెస్ అధ్యక్షురాలు తూండ్ల మౌనిక .సెక్రటరీ రవళి. కోశాధికారి తూముల వరలక్ష్మి. టైపిస్టు తాజోద్దీన్. వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రెనే లో ఉచిత మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం

కరీంనగర్ టౌన్, మే 6 (ప్రజాజ్యోతి ) నల్గొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మీడియా సమావేశం నిర్వహించారు. వరంగల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన రైతు సభలో చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ, రాష్ట్రానికి నాయకత్వం వహించే వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర ఉన్న వరంగల్‌లో జరిగిన సంఘటనలు, ఉద్యమకారులపై జరిగిన అన్యాయాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని పేర్కొన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ప్రజలు గుర్తుంచుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం రైతుల కోసం రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలు తీసుకుంటుంటే, ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడటం




సరికాదన్నారు. "మేము కూడా అదే భాషలో మాట్లాడగలం, కానీ మాకు సంస్కారం ఉంది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి, అమరవీరుల గౌరవం, ఉద్యోగాల అంశాల్లో గత ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే హక్కు తమకు ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన ముఖ్యమంత్రిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విమర్శలు పరిమితిలో ఉండాలని సూచించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, తమ తప్పులను సమీక్షిం చుకోవాలని ప్రతిపక్ష నాయకులకు హితవు పలికారు.
తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల ఫలితమని, ఆ త్యాగాలను గౌరవించకుండా నైతికతల గురించి మాట్లాడటం సమంజసం కాదన్నారు. ప్రతిపక్షం అంటే కేవలం విమర్శలు చేయడం మాత్రమే కాకుండా, అసెంబ్లీలో ప్రజా సమస్యలను లేవనెత్తడం కూడా బాధ్యతేనని పేర్కొన్నారు. రాజకీయ భేదాలు ఉన్నా వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే వీరేశం సూచించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు సరైన తీర్పు ఇస్తారని అన్నారు.

## రైతులు వ్యవసాయ మార్కెటింగ్ సదుపాయాలు ఉపయోగించుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

కరీంనగర్ బ్యూరో,మే 06 (ప్రజాజ్యోతి ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ, కరీంనగర్ లో రైతులకు



అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు, సహకార సంఘాలు మరియు ఎఫ్.పి.ఓల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, అలాగే వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ అబ్జర్వర్ శ్రీ పి.ఈశ్వరయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలు, సబ్సిడీ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు సహకార సంఘాలు మరియు ఎఫ్.పి.ఓలలో సభ్యత్వం పొందడం ద్వారా ఉత్పత్తుల విక్రయంలో మెరుగైన ధరలు పొందవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిణి జె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, మార్కెట్ యార్డుల సేవలు, గిడ్డంగి సదుపాయాలు, రైతు బజార్లు మరియు ఈ-మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను సరైన వేదికల ద్వారా విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి ఉద్యాన పంటల సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీ రామానుజాచార్యులు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న రుణ సదుపాయాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ఇతర సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులు, రైతు బజార్లు మరియు ఎఫ్.పి.ఓల ద్వారా విక్రయించి మెరుగైన ధరలు పొందవచ్చని తెలిపారు. మార్కెటింగ్ శాఖ అమలు చేస్తున్న పథకాలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రణధీర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆధునిక సాగు పద్ధతులతో పాటు మార్కెటింగ్ అంశాలపై అవగాహన పెంపొందించుకొని ఆర్థికంగా లాభపడే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె డి సి సి బ్యాంకు ఏ జి ఎం నాగరాజు , ఎఫ్ పి ఓ చైర్మన్ శ్రీ శంకరయ్య, మండల వ్యవసాయ అధికారులు, సత్యం, వంశీకృష్ణ, సంతోష్ కుమార్, ఇతర బ్యాంకు ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలు పెంచే కుట్ర పన్నుతున్న బీజేపీ ప్రభుత్వం

### సామాన్య ప్రజలపై భారం మోపితే చూస్తూ ఊరుకోం. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,మాజీ జెడ్పీటీసీ అందె స్వామి.

కరీంనగర్ కలెక్టరేట్, మే 6( ప్రజాజ్యోతి ) కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గ్యాస్,పెట్రోల్ ,డీజిల్ కొరతకు కారణమవుతూ ధరలు పెంచాలనే ఆలోచనతో ఉందని,సామాన్య ప్రజలపై భారం మోపితే చూస్తూ ఊరుకోమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,మాజీ జెడ్పిటిసి అందె స్వామి హెచ్చరించారు.పెట్రోల్ ,డీజిల్,గ్యాస్ అధిక ధరలకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు బుధవారం కరీంనగర్ లోని కమాన్ చౌరస్తా వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అందె స్వామి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒకలా ఎన్నికలయ్యాక మరోలా వ్యవహరించడం బీజేపీకే సాధ్యమని,సామాన్య పేద కుటుంబాలపై భారం వేయడానికి పెట్రోల్ డీజిల్ పై ఐదు రూపాయలు,వంట గ్యాస్ పై 50 రూపాయలు పెంచడానికి ఆయిల్ కంపెనీలు చూస్తున్నాయని ఇది ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వ అసమర్థత అని స్వామి అన్నారు.
రాష్ట్రంలో రైతాంగం పండించిన పంటలు కోసే సమయంలో పెట్రోల్,డీజిల్ కొరత ఏర్పడడం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తుతాయని, చిన్న, చిన్న వ్యాపార వర్గాలపై ప్రభావం పడుతుందని,వాణిజ్య సిలిండర్ పై ఇప్పటికే 993 రూపాయలు పెంచడంతో అది 3100 రూపాయలకు చేరిందని,గృహవసరాలకు ఉపయోగించే వంట గ్యాస్ ధరలు పెంచినట్లయితే పేద కుటుంబాలు ఎలా జీవిస్తాయని,చమరు గ్యాస్ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతూనే గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని, పెట్రోల్,డీజిల్ కొరతల వల్ల బంకుల వద్ద భారీగా జనాలు బారులు తీరుతున్నారని,ప్రభుత్వం మాత్రం ఎలాంటి కొరత లేదని చెప్పడం సరైంది కాదని, బీజేపీ ప్రభుత్వం తక్షణమే ధరలు పెంచే ఆలోచన విరమించుకోవాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అందె స్వామి హెచ్చరించారు.
సి పి ఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు పెట్రోల్,డీజిల్,గ్యాస్ అధిక ధరలకు వ్యతిరేకంగా సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో




కరీంనగర్ లోని కమాన్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,కసిరెడ్డి మణికంత రెడ్డి,బామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ,నాయకులు నూనావత్ శ్రీనివాస్, పీ.సాంబయ్య, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

కరీంనగర్ కలెక్టరేట్, మే 6( ప్రజాజ్యోతి ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ ప్రారంభమైంది. ఈ సర్వేను జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి సర్వే కరపత్రాలను అందజేసి, సర్వే ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించి ప్రజల ఉపాధి స్థితిగతులను అంచనా వేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు తెలిపారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలను ఎంపిక చేసి ప్రజల ఉపాధి పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. మొదట సాధారణ సమాచారాన్ని సేకరించి, అనంతరం ఎంపిక చేసిన కుటుంబాలపై మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సర్వే నిర్వహించి వివరాలను నమోదు చేయనున్నారు.సర్వేలో కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, విద్యార్హతలు, చదువు మానేసిన పరిస్థితులు, ఉన్నత విద్య, వృత్తి విద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి వంటి అంశాలపై సమాచారం సేకరిస్తున్నారు. రోజువారీ కూలీలకు సంబంధించిన పని గంటలు, వేతనం వివరాలతో పాటు మహిళల స్వయం ఉపాధి ఆదాయాన్ని కూడా నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.
సర్వే వివరాలను మొబైల్ ట్యాబ్‌ల ద్వారా నేరుగా నమోదు చేసి డేటాను సేకరిస్తున్నారు. ఇది పారదర్శకతకు తోడ్పడటంతో పాటు ఖచ్చితమైన సమాచారం సేకరణకు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంట శ్రీనివాస్, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ నాగారపు హరికృష్ణ, మెప్మా సిబ్బంది ఆర్పీలు రమ్య, కల్పన, మున్సిపల్ సిబ్బంది తంగళ్లపల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## నల్ల మట్టి టిప్పర్ల బీభత్సం..

### ప్రజల ప్రాణాలకు ముప్పు అధికారుల మౌనం ఎందుకు?

కొడిమ్యాల,మే 06,(ప్రజాజ్యోతి): మండలంలో నల్ల మట్టి రవాణా చేస్తున్న టిప్పర్లు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా, ఓవర్‌లోడ్‌తో మితిమీరిన వేగంతో సంచరిస్తున్న ఈ వాహనాలు రహదారులపై ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నాయి. గ్రామాల మధ్య రహదారులు తీవ్రంగా దెబ్బతింటుండటంతో పాటు, పాదచారులు మరియు వాహనదారులు ప్రాణభయంతో



ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా నిర్లక్ష్యంగా నడుస్తున్న టిప్పర్లను తక్షణమే కట్టడి చేయాలని వారు కోరుతున్నారు. "ప్రమాదం జరిగేలోపు అధికారులు స్పందించి, పరిమితి మించిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాలను రక్షించాలి" అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని వారు ఆరోపిస్తున్నారు. స్థానికులు వాహనాలపై కఠిన తనిఖీలు నిర్వహించి, ఓవర్‌లోడ్ టిప్పర్లను వెంటనే నిలిపివేయాలని, గ్రామీణ రహదారులపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సొంతింటి కల నేరవేరిన వేళ..

కొడిమ్యాల,మే 06,(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ పాలనలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన తాండ్రాల మధులత అంజి ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం



ప్రారంభించి, ఇల్లు లేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు దశల వారీగా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. నాచుపల్లి గ్రామంలో 50 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో దాదాపు 40 ఇళ్లు పూర్తికి చేరుకున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, నాయకులు జలంధర్, చింటూ, అజయ్ రెడ్డి, రమణ రెడ్డి, గౌతమ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

## అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సింథటిక్ ట్రాక్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### – జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** జిల్లాలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సింథటిక్ ట్రాక్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆదేశించారు.లకారం ట్యాంక్ బండ్ వద్ద జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ పరిశీలించారు.ఖానాపురం హవేలీ ఊర చెరువు నుంచి ధంసలాపురం వరకు నిర్మిస్తున్న ట్రంక్ మెయిన్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధంసలాపురం వద్ద ఎస్‌టీపీ (ఎస్‌టీపీ) ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని సమీప చెరువులకు విడుదల చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ట్రంక్ మెయిన్‌కు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం సింథటిక్ ట్రాక్ పనులను పరిశీలించిన కలెక్టర్,పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన చిన్నపాటి పనులను వచ్చే రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి ఉపయోగానికి సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ పనులు తనిఖీ సందర్భంగా పబ్లిక్ హెల్త్ డిఈ నవీన్ కుమార్,డివైఎస్ఓ సునీల్ రెడ్డి,క్రీడా కోచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## రైతులు ఆయిల్‌ఫామ్ పంటలు సాగు చేయాలి

### – భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం టౌన్, మే 6, ప్రజాజ్యోతి** రైతులు ఆయిల్‌ఫామ్ పంటలను సాగు చేసేందుకు ముందుకు రావాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం జరిగిన రైతు వారోత్సవాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌ఫామ్ సాగు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అలాగే పంటల దిగుబడి, ధర, ధాన్యం సేకరణ ఇతర అంశాల్లో ప్రభుత్వం రైతులకు వెన్నంటే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ పాల్గొన్నారు.

## గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై సీపీఐ నిరసన





**పినపాక,మే 06(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలో గ్యాస్,పెట్రోల్,డీజిల్ కొరతను నివారించి దిగుమతులను పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.తోగటి కుమార్ మాట్లాడుతూ.. మండలంలో పంటల కోతల సమయంలో డీజిల్ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని,గ్యాస్, పెట్రోల్ , డీజిల్ కొరత లేదని చెప్పే పాలకులు ఒక్కసారి పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఒక్కొక్క సిలిండర్ పై రూ.2000 నుండి రూ.3000 ధర అమ్ముతున్నారు. గ్యాస్,పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోజిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహర చారి,సహాయ కార్యదర్శులు కప్ప వెంకటేశ్వర్లు, రమేష్ ఐలయ్య, వర్షా నరసింహారావు, హమాలీల సంఘం కుర్రి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు



**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులు జీవితంలో స్థిరపడటానికి వై టి సి ద్వారా అందించే శిక్షణలు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శిక్షకులు యువతీ యువకులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు సర్ సెంటర్ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను శిక్షకులతో , యువతీ యువకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న నిరుద్యోగ గిరిజన యువతి యువకులు పై చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఐటీడీఏ ప్రాంగణంలోని వై టి సి లో అందిస్తున్న వివిధ రకాల శిక్షణలను శ్రద్ధగా తీసుకొని ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని ఆయన అన్నారు. ఈసారి బాగా గుర్తింపు పొందిన సంస్థలైన ఐటీ హెల్ప్ డెస్క్, అటెండెంట్ కోర్స్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్స్, ఎంబ్రాయిడరీ మిషన్ ఆపరేటర్ కోర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్, టైలరింగ్ మిషన్ ఆపరేటర్ కోర్స్ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా శిక్షణలు ఇప్పిస్తున్నందున యువతి యువకులు శ్రద్ధగా మూడు నెలల పాటు శిక్షణ తీసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. సంబంధిత కంపెనీల శిక్షకులు యువతీ యువకులకు పూర్తిస్థాయిలో నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణలు అందించాలని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతీ యువకులకు తప్పనిసరిగా ఉపాధ్యాయ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వై టి సి సెంటర్ ఇన్చార్జి శ్రీను, భవిత సేల్స్ సిబ్బంది సమ్మయ్య, మణిదీప్, దీనాకుమారి, అనురాధ, అభిరామ్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం

### దేవస్థానం నిత్యన్నదానంకు రూ.లక్ష విరాళం

**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేదాశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా ఖమ్మంకు చెందిన బుడిగం వీరయ్య, రేణుక దంపతులు దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం అందజేశారు.



# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### – జగన్నాథపురం రైతు వేదిక సదస్సులో పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, మే 6 ( ప్రజా జ్యోతి)** రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నదని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు వారోత్సవాల లో భాగంగా పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాథపురం రైతు వేదికలో పాల్వంచ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సంక్షేమ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రైతులకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. రైతు రుణమాఫీ, ఎకరానికి రెండు దఫాలుగా 12 వేల రూపాయలు రైతు భరోసా, రైతు భీమా, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర తోపాటు సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్, రైతు వేదికలో రైతులకు శాస్త్రవేత్తల ద్వారా పంటల మెళుకువలు శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. రైతు సహకార వారోత్సవాలలో రైతులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కొత్వాలఅన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి ఏ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూ రావు, హార్టికల్చర్ ఆఫీసర్ జె కిషోర్, లేబర్ ఆఫీసర్ బి ఎన్ రాజు, డిసిసిబి మేనేజర్ ఏ స్వప్న, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజా ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం జయశ్రీ, మండల వ్యవసాయ శాఖాధికారి పి శంభో శంకర్, సొసైటీ సీఈవో జి లక్ష్మి నారాయణ, సొసైటీ డైరెక్టర్లు జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, గంధం వీచిన రామయ్య, బి అశోక్‌లి, తదితరులు పాల్గొన్నారు.

### పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ

# అటానమస్ కళాశాలలో కొత్త డిగ్రీ కోర్సులు

### – అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ ప్రోగ్రామ్స్ ప్రారంభం



**పాల్వంచ, మే 06, ప్రజాజ్యోతి:** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ తెలిపారు. యూజీసీ ఆమోదంతో, జాతీయ విద్యా విధానం మార్గదర్శకాల ప్రకారం కళాశాలలో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఈడీపీ)ను ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బీకాంలో బీఎఫ్ఎస్ఐ, బీఎస్సీలో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులను ఈ విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోర్సుల్లో విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణ, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించబడతాయి.కోర్సు వ్యవధి మూడు సంవత్సరాలు కాగా, ఐదో సెమిస్టర్‌లో ఆరు నెలల చెల్లింపు అప్రెంటిస్‌షిప్ ఉంటుంది. శిక్షణ కాలంలో నెలకు రూ.7,000 నుంచి రూ.12,000 వరకు స్టైపెండ్ పొందే అవకాశం ఉందని తెలిపారు.బీకాం––బీఎఫ్ఎస్ఐ కోర్సు ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఫిన్‌టెక్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు ద్వారా హాస్పిటల్ మేనేజ్‌మెంట్, పేషెంట్ కేర్, హెల్త్ ఇన్సూరెన్స్, హెల్త్ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏ విభాగం నుంచైనా ఈ కోర్సులకు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బలమైన కెరీర్ నిర్మించుకోవాలని సూచించారు. దోస్త్ ద్వారా విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చని, మొదటి విడత నమోదు ఈ నెల 7తో ముగుస్తుందని తెలిపారు. రెండో విడత నమోదు ఈ నెల 15 నుంచి 25 వరకు, మూడో విడత నమోదు ఈ నెల 31 నుంచి జూన్ 15 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

### ఐడిఓసీ కార్యాలయంలో ఎరువులు విత్తనాలు

# సన్నద్ధతపై జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ సమీక్ష


### – రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి – జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, మే 6,(ప్రజాజ్యోతి)** ప్రజాపాలన––ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు , ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1 లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు అవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు తావు ఉండకూడదన్నారు.ఎరువుల నిల్వలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ జిల్లా ,మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. అనంతరంజిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు ఎరువుల డీలర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం..ప్రమాదాలకు నెలవు..



– భద్రాచలం వారధి ప్రవేశం వద్ద తరచూ రహదారి ప్రమాదాలు
– ఇటీవల కాలంలో మూడు ప్రమాదాలు
– ప్రమాద సూచికలు ఏర్పాటు చేయని జాతీయ రహదారుల శాఖ అధికారులు

**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి,** భద్రాచలంలోకి ప్రవేశించే గోదావరి వారధి మూలమలుపు వద్ద ఇటీవల కాలంలో తరచూ రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు అదుపు తప్పి పక్కనే ఉన్న టవర్‌ను ఢీకొట్టడం పలు మార్లు జరిగాయి. బ్రిడ్జి మీద నుంచి అప్రోచ్ రోడ్డకు వచ్చే వాహనాలు అయ్యప్పగుడి సమీపంలో యు ఆకారంలో ఉండే రహదారి వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు జాతీయ రహదారుల శాఖ అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు కొందరు డ్రైవర్లు అదుపు చేయలేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా బుధవారం భద్రాచలం రామాలయంకు కారులో తొమ్మిదితో వస్తున్న వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్తు టవర్‌ను ఢీకొట్టింది. ఇదేవిధంగా ఇటీవల కాలంలో మరో కారు ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. అధికారులు ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రామ భక్తులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు సైడ్ రైలింగ్, సైన్ బోర్డులు, రోడ్డు సరిహద్దును సూచించే రేడియం స్టిక్కరింగ్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### భద్రాచలం డీఎస్పీని కలిసిన

## బార్ అసోసియేషన్ ప్రతినిధులు




**భద్రాచలం టౌన్ , మే 6 ప్రజాజ్యోతి** భద్రాచలం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు బుధవారం భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్‌ను కలిసారు. అనంతరం న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోలీసు యంత్రాంగానికి, న్యాయవాదులకు మధ్య ఉండాల్సిన సమన్వయంపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణలో, న్యాయ విచారణ ప్రక్రియలో పోలీసు శాఖకు బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ సహకరిస్తుందని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, మహిళ ప్రతినిధజ ఎం. తరుణీ, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కె. శ్రీమన్నా రాయణ,ఎం.వి.రమ, కె. భాస్కరరావు, రవితేజ, వి. సురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ జన్మదిన వేడుకలు

కొత్తూర్ మే 06 (ప్రజా జ్యోతి):
బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ జన్మదిన వేడుకలు బుధవారం చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా





నిర్వహించారు. ఎఫ్ సి ఎన్ వృద్ధాశ్రమంలో ఆయన జన్మదిన వేడుకలు జరిగాయి. వృద్ధులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు నాయకులు ఆయనకు శాలువా వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆశ్రమ వృద్ధులు ఆయనను దీవించారు.జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారు బిఆర్ఎస్ యువజన విభాగం మాజీ మండల అధ్యక్షులు కడల శ్రీశైలం,నాయకులు బ్యాగరి రాజు, దేశాల జైపాల్, టిఆర్ఎస్ మహేశ్వరం మండల యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధార్థ,ఎస్ బి పల్లి ఉపసర్పంచ్ సున్నాల గణేష్,పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ ఎమ్మె అజయ్, కుమ్మరి గూడెం పాండు,వడ్డే మహేష్,జామకాయల కృష్ణయ్య,ఎమ్మె వెంకటయ్య, శ్రీకాంత్,మన్నె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడితోనే లాభదాయక వ్యవసాయం

## ప్రకృతి, సేంద్రియ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 06, (ప్రజా జ్యోతి):
వ్యవసాయ రంగంలో సమగ్ర మార్పులకు పంటల మార్పిడి తొలి అడుగుగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రామిరెడ్డి అన్నారు. వరి, పత్తి పంటలపై అధిక ఆధారపడకుండా రైతులు ఉద్యాన, వాణిజ్య పంటల వైపు మళ్లాలని సూచించారు. హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం—వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా రెండో రోజు బుధవారం ఘనంగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వేలాది మంది రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. పంటల మార్పిడి ద్వారా రైతులు లాభదాయక సాగు వైపు అడుగులు వేయాలని సూచించారు. భవిష్యత్తులో వరి, పత్తి పంటలపై అధిక ఆధారపడటం వల్ల సమస్యలు తలెత్తే అవకాశముందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని అన్నారు. కోతుల బెడదతో పంటభూములు నష్టపోతున్నాయని,




చిన్న రైతులకు ఫెన్సింగ్ సబ్సిడీ ప్రతిపాదనను ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు. రైతులు సంఘటితంగా ఉండి దళారుల దోపిడీకి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు, ప్రమాదకర పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేయడంలో రైతు మేళా వేదికగా నిలిచిందన్నారు. భూసారాన్ని కాపాడేందుకు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వరి, పత్తి, మొక్కజొన్న పంటలపైనే ఆధారపడకుండా పప్పుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటలను సాగు చేయాలని కోరారు. నాణ్యమైన విత్తనాలు వినియోగించి, శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేస్తే దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఉద్యాన అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# శివధర్ రెడ్డి నియామకంపై సవాల్

మొదటిపేజీ తరువాయి..

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చీఫ్ సెక్రటరీ ర్యాంకులో ఆయనను నియమించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు. శివధర్ రెడ్డి ని నియమిస్తూ



ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపిఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన స్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి శ్రీమతి బి. సుమతి, ఐ జి పి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ, పోలీసు విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**సాదా బైనామా పెండెన్సీని మార్గదర్శకాల ప్రకారం పూర్తిగా క్లియర్ చేయాలి**

**భూ భారతీ, మీ సేవా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

**ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలి**

**పౌర సేవల దరఖాస్తుల్లో పెండెన్సీకి అవకాశం లేదు**

**భూ భారతీ స్లాట్లలో ఆలస్యం సహించబోం, సమయానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి**

**మార్గదర్శకాల ప్రకారం అన్ని దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలి**

**ప్రజావాణి వినతులను 15 రోజుల్లో పరిష్కరించాలి**

**రెవెన్యూ శాఖపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:
రెవెన్యూ శాఖలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మీ సేవా,భూ భారతీ, సాదా బైనామా,ప్రభుత్వ భూములు,పెండింగ్ సర్వేలు,ఇసుక,ఎస్ఐఆర్ వంటి అంశాలపై సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సాదా బైనామా అంశంపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్,ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఎన్ని ఫీల్డ్ ఎన్క్వైరీలు నిర్వహించారు, ఎన్ని అర్హులను గుర్తించారు, ఎన్ని దిరఖాస్తులను ఆర్డీవోకు పంపించారో నివేదికలో స్పష్టంగా చూపించాలని ఆదేశించారు. జిల్లాలో సాదా బైనామాకి సంబంధించి తహసీల్దార్లు మార్గదర్శకాల ప్రకారం అన్ని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.సాదా బైనామా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 2014 జూన్ 2కు ముందు జరిగిన లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని,దరఖాస్తుదారులు భూమి స్వాధీనంలో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా రెగ్యులరైజ్ చేయరాదని, సరైన ఆధారాలు లేకుండా భూమి యాజమాన్యం మారకూడదని హెచ్చరించారు. ఆమోదించిన దరఖాస్తులకు పంచనామా తప్పనిసరి కాగా,తిరస్కరణ లకు కారణాలు,ఎన్క్వైరీ నివేదిక సరిపోతుందని తెలిపారు. భూమి స్థితిగతులపై పొరుగు పట్టాదారుల అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.భూ భారతీ పెండింగ్ స్లాట్లపై సమీక్షిస్తూ, రిజిస్ట్రేషన్ జరగని ప్రతి స్లాట్‌కు కారణాలు నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేయని వారి స్లాట్లు రద్దు అవుతాయని ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భూ భారతీ క్లియరెన్స్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తూ, ప్రతి రోజు 3 మండలాల నుండి క్లియర్ చేసిన ఫైళ్లను జిల్లా స్థాయికి తుది ఆమోదం కోసం పంపించాలని తెలిపారు. జిల్లా స్థాయి ఆపరేటర్ మండల అధికారులతో సమన్వయం చేస్తూ, పంపిన ప్రతి ఫైల్‌కు భౌతిక ప్రతులు తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి చేరేలా చూడాలని సూచించారు.రెవెన్యూ సదస్సుల్లో పెండింగ్ దరఖాస్తులపై మాట్లాడుతూ,అసైన్‌మెంట్ భూములను మినహాయించి, మిగతా దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా దరఖాస్తులను తహసీల్దార్లు సమయానికి క్లియర్ చేయాలని, పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తుల్లో పెండెన్సీ ఎట్టి పరిస్థితుల్లోనూ




సహించబోమని హెచ్చరించారు. తదుపరి సమీక్ష నాటికి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూముల వివరాలు, విస్తీర్ణం, అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలతపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భూములను 5, 10, 20 ఎకరాల విభాగాలుగా వర్గీకరించి, రహదారి సౌకర్యం ఉన్నవి, లేనివి అని స్పష్టంగా చూపించాలని సూచించారు. నేలకొండపల్లి మండలంలో ఇప్పటికే స్వయం సహాయక సంఘానికి పెట్రోల్ బంక్ కోసం భూమి కేటాయించిన నేపథ్యంలో, రైస్ మిల్ ఏర్పాటు కోసం మరో 5 ఎకరాల భూమి లభ్యతపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు.2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మార్గదర్శకాల ప్రకారం ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ నిర్వహించాలని సూచించారు.పోలింగ్ స్టేషన్ వారీగా ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ తక్కువగా ఉన్న చోట్ల బూత్ స్థాయి అధికారుల పనితీరును నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే ఓటరు రెండు చోట్ల నమోదు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఒక్క చోట మాత్రమే నమోదు ఉండేలా చూడాలని మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.అభివృద్ధి పనులు, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఇసుక సమస్యలు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. 'మన ఇసుక వాహనం' విధానం ప్రకారం ఎవరైనా సాండ్ బజార్ ద్వారా ఇసుకకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులను పరిశీలించి టోకెన్ జారీ చేస్తారని, విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. సాండ్ బజార్‌లో లభించే ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉన్నందున ప్రజలు పొందాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని గ్రీవెన్స్ విభాగానికి పంపించి, అక్కడి నుంచి సంబంధిత అధికారులకు పంపాలని తెలిపారు. ప్రతి వినతిని ప్రజావాణి ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయడంతో పాటు, తీసుకున్న చర్యల నివేదికను కూడా నమోదు చేయాలని సూచించారు. ఏ వినతీ 15 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, 15 రోజులు దాటిన వినతుల వివరాలను కలెక్టర్‌కు నివేదించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు తమకు వచ్చిన ప్రతి వినతిని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్,తహసీల్దార్లు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల సూపరింటెండెంట్లు,ఆర్ఐలు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు ఈ పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు.
సాధారణంగా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తుంది. దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా మిగిలిపోకూడదు.. అది పేదవాడి ఆకలి తీర్చి, పౌష్టికాహారంగా మారాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా మొక్కజొన్న, జొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు పౌల్ట్రీ రైతులకు అవసరమైన మేరకు కూడా సరఫరా చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం పట్ల రైతులు, సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్
# విష ప్రచారం

మొదటిపేజీ తరువాయి..

రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తోందని, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ రబీలో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో భాగంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం 2.63 లక్షల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) నుంచి ధాన్యాన్ని, రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని మంత్రి ఉత్తమ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలి అనేది కూడా అధికారులకు సూచనలు చేశామని అన్నారు. ప్రతి కొనుగోలు సెంటర్లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై భవన్ లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి రోజు వెదర్ అలర్ట్ అన్ని కొనుగోలు సెంటర్లకు అందిస్తున్నామని..తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ఎక్కువ కొనుగోలు సెంటర్ల ను ఏర్పాటు చేశామని... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కంటే కాంగ్రెస్ హయంలో ఎక్కువ మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు.

## రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్
# నయవంచన

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ పార్టీని నిలదీద్దామని, గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను తన్ని తరిముదాము, కానీ ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కేవలం కొన్న పంటలకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందన్న ఏకైక ఉద్దేశంతోనే రాష్ట్రంలోని రైతన్నలను మోసం చేస్తున్నదని కేటీఆర్ అన్నారు.రేవంత్ రెడ్డికి సిగ్గు, శరం ఉంటే రైతన్నల కష్టాలను పట్టించుకోవాలని, లేకుంటే తెలంగాణ రైతన్నలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తన్ని తరిముతామని హెచ్చరించారు. గత 48 గంటల్లో దాదాపు ఎనిమిది మంది రైతన్నలు రాష్ట్రంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్ ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణమన్నారు.రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని చేతగాని దద్దమ్మ దగుల్బాజీ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నర సంవత్సరాల్లో రైతన్నలను నిండా ముంచుతున్న కాంగ్రెస్ పార్టీ నాలుగు సంవత్సరాల క్రితం రాహుల్ గాంధీని తెచ్చి రైతు డిక్లరేషన్ పేరిట అడ్డగోలుగా హామీలు ఇచ్చి రైతులతో ఓట్లు వేయించుకున్నదని మండిపడ్డారు. రాహుల్ గాంధీ రైతు హామీలు ఇచ్చి డిక్లరేషన్ పేరిట ఓట్లు దోచుకొని ఢిల్లీకి పారిపోయారని, తెలంగాణ రైతన్నలు ఆత్మహత్యల పాలవుతుంటే, అవస్థలకు గురవుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు.రైతు భరోసా, రైతు రుణమాఫీ, పంటలకు బోనస్, పంటల కొనుగోళ్లు, యూరియా సరఫరా, కరెంటు కోతలు ఇలా రాష్ట్ర రైతాంగం పూర్తి సంక్షోభం దిశగా పోతున్నదని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని రైతన్నల కష్టాల పైన దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రైతన్నలు ఇంత అవస్థలు పడుతుంటే సిగ్గులేకుండా కాంగ్రెస్ పార్టీ రైతు వారోత్సవాలు, రైతు మేళాల పేరిట టైం పాస్ చేస్తున్నదన్నారు.
ఎన్నికల ముందు 50 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి చివరికి 12 వేల కోట్ల రూపాయలు మాత్రమే చేసి రైతులను మోసం చేయడంతో అనేకమంది రైతన్నలు అప్పుల పాలయ్యారన్నారు. రైతులను రెచ్చగొట్టి బ్యాంకుల నుంచి రెండు లక్షల రుణాలు తెచ్చుకోవాలి, మాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతుల ఖాతాల్లో రైతు బంధు రావడం లేదు కానీ రాహుల్ గాంధీకి మాత్రం ప్రతి నెల టంచనుగా డబ్బులు పడుతున్నాయని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ లో ప్రెస్ క్లబ్ లో సమావేశం పెట్టి మరి రైతులకు రుణమాఫీ అంశంలో చర్చకు రావాలని రేవంత్ రెడ్డిని సవాలు చేస్తే పారిపోయిన పిరికిపంద అని కేటీఆర్ అన్నారు.ఒకప్పుడు కాంగ్రెస్ పాలనలో అన్నదాతలకు అడ్రస్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రం, భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ మళ్ళీ ఈ కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, పాముకాట్లు, వ్యవసాయ సంక్షోభం వంటి అన్ని సమస్యలు తిరిగి వస్తున్నాయి అన్నారు.
వ్యవసాయ సంక్షేమ పథకాలు అన్నింటిని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరి మూడేళ్ల లోపే మూడు లక్షల డెబ్బై వేల కోట్ల రూపాయల అప్పు తెచ్చి ఎవరికి దోచి పెట్టిందని కేటీఆర్ ప్రశ్నించాడు. కనీసం ఎరువులు ఇవ్వడం చేతకాని ఎధవల సర్కార్ కాంగ్రెస్ పార్టీ అని పంటల కొనుగోలును పక్కకు పెట్టి కమిషన్లు, కాంట్రాక్టుల పైననే కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించిందన్నారు.
రైతులు ఎండల్లో నిలబడి చక్కర వచ్చి పడిగాపులు పడి పడిపోతుంటే ఢిల్లీకి విమానాల్లో చక్కర్లు కొడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇంత వ్యవసాయ సంక్షోభ పరిస్థితులు ఉన్నా రైతు మరణాలు కొనసాగుతున్న ఇప్పటిదాకా ఒక్క సమీక్షా సమావేశాన్ని కూడా నిర్వహించిన పాపాన పోలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ బీజేపీ దేశంలో జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలనే కొనసాగిస్తుందన్నారు. బీజేపీ పార్టీ కూడా నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి రైతుల నిరసనతో వెనక్కి తగ్గిందని స్వయంగా ప్రధాన మంత్రి క్షమాపణ కోరిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక నాలుగు పంట సీజన్లు వచ్చినయి కానీ పండించిన పంటను కొనుగోలు చేయమన్న ప్రతిసారి రైతులకు కష్టాలే ఎదురవుతున్నాయని, కొనుగోలు కేంద్రాలు పెట్టక, పెట్టిన కొనుగోలు కేంద్రాలలో పంటను కొనుగోలు చేయక తీవ్రంగా అవస్థల పాలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు.
ఈ సందర్భంగా రైతన్నల పంటలను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, ఆత్మహత్యలకు సంతాపం ప్రకటించి రైతు మరణాల పాలైన రైతన్నలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్ ను సంపూర్ణంగా అమలు చేయాలని, రైతుల రుణమాఫీని సంపూర్ణంగా పూర్తి చేయడంతో పాటు రైతు భరోసా బకాయిలు చెల్లించాలని తీర్మానాలు చేశారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967